ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.8	27.4
కావలి	36	28
ఆత్మకూరు	39	27
ఉదయగిరి	39	27
కందుకూరు	36	28

మార్కెట్లోకి మధుర ఫలం

ఊరిస్తున్న తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ

ఇప్పుడిప్పుడే మార్కెట్లో మెరుస్తున్న బంగినపల్లి

మరో వారంలో ముమ్మరంగా కోతలు

వాతావరణం మార్పులతో దిగుబడిపై ప్రభావం

అధిక వర్షాలు, నల్లతామరతో రైతు కుదేలు

వేసవి తాపంలోను మనసును ఉత్తేజపరిచే మధురఫలం మామిడి మార్కెట్లోకి వచ్చేసింది. రాష్ట్రంలోనేగాక దేశ, విదేశాల్లోను మామిడి మాధుర్యానికి కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు పొందిన ఉలవపాడు మామిడి పండ్లు జాతీయ రహదారిపై కనువిందు చేస్తున్నాయి. తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ, నాటుమామిడి వంటి రకాలు ఉలవపాడు వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటైన రిటైల్ మార్కెట్లో నోరూరిస్తున్నాయి. ఇక మామిడిలో రారాజు అయిన బంగినపల్లి మామిడి రకాలు ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి వస్తున్నాయి. మరో వారం, పది రోజుల్లో మార్కెట్‌లోకి విరివిగా వచ్చే అవకాశం ఉంది.

- కందుకూరు, ఉలవపాడు (ఆంధ్రజ్యోతి)

మామిడి అంటేనే ప్రజల్లో ఉండే ఆతృతను సొమ్ము చేసుకునేందుకు ఓ మోస్తరు పక్వానికి వచ్చిన కాయలనే వ్యాపారులు కోసేసి ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం బంగినపల్లి మామిడి పండ్లు టన్ను రూ.60వేలు వరకు పలుకుతుండగా ముంబాయి, ఛత్తీస్‌ఘడ్‌లకు ఎగుమతి చేస్తున్నారు. రిటైల్ మార్కెట్లో కిలో రూ.100 నుంచి 120లకు విక్రయిస్తుండగా బంగినపల్లి మామిడి పండ్లను కొనుగోలుచేసేం దుకు జాతీయరహదారిపై ప్రయాణికులు పోటీలు పడుతున్నారు. మే మొదటివారం తర్వాత కోతలు ముమ్మరం కానున్నాయి. అలాగే తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ తదితర రకాలు కిలో రూ.50 నుంచి 70 వరకు పలుకుతున్నాయి. ఇక నాటురకం మాత్రం టన్ను రూ.10వేలు వంతున పల్ప్, జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతిచేస్తున్నారు.

● పడిపోయిన దిగుబడులు

డిసెంబరు ద్వితీయార్థం వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురవటంతో మామిడి దిగుబడులపై తీవ్రప్రభావం చూపింది. సాధారణంగా నవంబరు ద్వితీయార్థంలోగా ఈ ప్రాంతంలో వర్షాలు పూర్తయి తెరపి వాతావరణం ఉంటుంది. దీంతో భూములు ఆరుదలకు రాగానే డిసెంబరు నుంచి మామిడితోటల్లో పూతలు ప్రారంభమై జనవరి ఆఖరునాటికి పిందెలు ఏర్పడతాయి. ఫిబ్రవరిలో వచ్చే శివరాత్రి నాటికి మామిడికాయలు శివలింగాలు అంత అవుతాయనేది నానుడి. అయితే ఈ ఏడాది డిసెంబరు ద్వితీయార్థం వరకు వర్షాలు కురవటంతో సంక్రాంతి పండుగ వరకు మామిడితోటల్లో పూతలే రాలేదు. జనవరి ద్వితీయార్థం నాటికి విపరీతంగా పూతలు రావటంతో దిగుబడి బాగా వస్తుందని రైతులు సంబరపడ్డారు. అయితే ఫిబ్రవరి ఆఖరునాటికి కూడా పూత పిందెగా మారే దశ పూర్తవకపోవటంతో ఆ సమయంలో తామరపురుగు కోలుకోలేని దెబ్బతీసింది. సాధారణంగా వచ్చే ఎర్రతామర, గోధుమవర్ణం తామరకు తోడు ఈ ఏడాది నల్ల తామర విజృంభించటంతో పూతలు, పిందెలు మాడిరాలిపోయాయి. ఉలవపాడుతోపాటు గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఉలవపాడు మండలంలో అత్యధికంగా 8వేల ఎకరాలలో తోటలు ఉండగా గుడ్లూరులో 3500 ఎకరాలు, మూడు మండలాల్లో 1500 ఎకరాలలో మామిడి తోటలు ఉంటాయని అంచనా. సాధారణంగా అన్నీ అనుకూలిస్తే ఎకరానికి నాలుగైదు టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది కేవలం 2వేల ఎకరాల్లో మాత్రం ఎకరానికి మూడు టన్నుల వరకు దిగుబడి రావచ్చని మిగిలిన 11 వేల ఎకరాల్లో ఎకరానికి సరాసరిన 1.5 టన్నులకు మించి దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఖర్చులు కూడా చేతికిరాక నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● దేశీయంగా ఎగుమతులు

కొన్నేళ్లుగా ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్న రైతులు అంతర్జాతీయ ఎగుమతులు కూడా లేకపోవటంతో గిట్టుబాటు ధరలు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ప్రారంభమయ్యే సమయంలో పదిరోజులు, కాయలు అయిపోయేదశలో 15 రోజులు కిలో రూ.100వరకు అమ్ముకుంటుండగా మిగిలినరోజుల్లో కిలో రూ.30 నుంచి 40లకే తెగనమ్ముకోక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో ఈ ప్రాంతం నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి తదితర నగరాలకు పెద్దఎత్తున మామిడి ఎగుమతులు జరిగేవి. అయితే ఇటీవలికాలంలో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మామిడిసాగు పెరగటం, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ మామిడి సాగు గణనీయంగా పెరగటంతో బెంగళూరు, హైదరాబాద్‌లకు ఉలవపాడు ప్రాంతం నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం ఈ ప్రాంత వ్యాపారులు ఛత్తీస్‌ఘడ్, భువనేశ్వర్, ముంబయి నగరాలపై దృష్టిపెట్టి ఎగుమతులు చేస్తున్నారు. బెంగళూరు నుంచి అడపాదడపా దుబాయ్, లండన్‌లకు కూడా ఉలవపాడు మామిడిపండ్లు ఎగుమతి అవుతున్నాయి. ఎంత చేసినా దేశీయ మార్కెట్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితుల్లో రిటైల్ విక్రయాలనే ప్రధానంగా నమ్ముకుని మామిడిపండ్లను తెగనమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది కూడా మరో వారంరోజులు గడిస్తే మామిడి ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, ఓవైపు దిగుబడులు లేక మరోవైపు ధరలూ లేక మా పరిస్థితి ఏమిటోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తామరపురుగు దెబ్బతీసింది

మామిడిలో పూతలు దండిగా వచ్చినప్పటికి అనూహ్యంగా వచ్చిన వాతావరణ మార్పులతో పూతలు నిలబడలేదు. దీనికితోడు తేనెబంక, త్రిప్స్ ఇంకా మామిడి పూతపై అధిక ప్రభావం చూపడంతో ఎన్ని సార్లు మందులు పిచికారి చేసిన పూతలు, పిందెలు కాపాడుకోలేకపోయాం. ఈ ఏడాది లింగసముద్రం మండలం పరిసర ప్రాంతాల్లో 100 ఎకరాలు కౌలు తీసుకున్నాం. కౌలు చెల్లింపు, సేద్యం పెట్టుబడిలో సగానికిపైగా నష్టాలు సవిచూడక తప్పదనిపిస్తోంది.

- పందిళ్ల నాగరాజు, మామిడి కౌలు రైతు



కౌలురైతుకు కన్నీళ్లే!

ఎర్రనేలల్లో మామిడి ఈ ఏడాది కంటతడి పెట్టించింది. మాకున్న 5 ఎకరాలు కాకుండా మరో 16 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. ఆశించినంత పూతలు వేసినప్పటికి త్రిప్స్, తేనెమంచు ఆశించడంతో ఐదారుసార్లు మందులు పిచికారీ చేసినా పూత నిలబడకపోవడంతో మందులు కొట్టడం కూడా ఆపేశాం. 20 శాతం కంటే తక్కువ పంట నిలబడింది. రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టగా రూ.లక్ష చేతికొస్తే మహాభాగ్యం అన్నట్లు ఉంది మా పరిస్థితి.

- డమ్ము రవికుమార్



● హైవేపై వెలసిన దుకాణాలు

ఉలవపాడు జాతీయ రహదారికి ఇరువైపులా ఆదేవిధంగా రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి వరకు పదుల సంఖ్యలో మామిడి అంగళ్ల వెలిశాయి. ప్రస్తుతానికి రోడ్డుపై మార్కెట్ ధరకంటే రెండింతలకు అమ్ముతున్నారు. మరో 15 రోజుల వరకు బంగినపల్లి రకానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అంగళ్ల వ్యాపారులు వాహనదారులకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.

1న సీఎం పర్యటన ఖరారు



ఆత్మకూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1వ తేదీ గురువారం ఆత్మకూరు పర్యటన ఖరారయ్యింది. ఉదయం 11.30 గంటలకు ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి 11.50లకు నెల్లూరుపాళెం చేరుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 12.10 నుంచి 12.30 వరకు నెల్లూరుపాళెంలోని భవన నిర్మాణ కార్మికులతో చంద్రబాబు మాట్లాడతారు. అనంతరం 12.35 గంటలకు నారంపేట సమీపంలోని ఏపీఐఐసీకి చేరుకుని ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తారు. అనంతరం 1.30 నుంచి 3 గంటల వరకు ప్రజావేదికలో స్థానికులతో ముఖాముఖిలో పాల్గొంటారు. ఆ తర్వాత 3.05 గంటలకు టిడ్కో మైదానానికి చేరుకుని టీడీపీ శ్రేణులతో మాట్లాడతారు. అనంతరం 4.40 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు ఉండవల్లికి బయలుదేరివెళతారు.

● ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను మంగళవారం ఉదయం కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వారివెంట ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్, పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు గ్రీన్‌సిగ్నల్

మే 1 నుంచి 31వరకు నిర్వహణ ● జిల్లాలో 57 కేంద్రాల్లో తర్ఫీదు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మే 1 నుంచి 31వతేదీ వరకు నెల రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలియచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 57 కేంద్రాల్లో యువతకు శిక్షణ ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లచే ప్రతి క్రీడలో ప్రాథమిక స్థాయి నుంచి తర్ఫీదు అందించి మెలకువలను నేర్పించనున్నారు. ఇందుకుగాను పీఈటీలు, సీనియర్ క్రీడాకారులకు డీఎస్ఏ గౌరవవేతనం ఇవ్వడంతోపాటు క్రీడాపరికరాలను కూడా అందచేస్తారు. క్రమం తప్పకుండా శిక్షణకు హాజరైన విద్యార్థులకు చివరిరోజున సర్టిఫికెట్లు అందచేస్తారు.

● తర్ఫీదు ఇచ్చే క్రీడలు

ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, నెట్‌బాల్, రోలర్‌స్కేటింగ్, సెపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్, హాకీ, స్విమ్మింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి భవిష్యత్‌లో జరిగే పోటీల్లో అవకాశం కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోండి

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడాకారులుగా రాణించేందుకు భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందేందుకు ఈ శిబిరాలను వేదిక చేసుకోవాలి. నెల్లూరు వాసులకు అనుకూలంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశాము.

- ఆర్‌కె.యతిరాజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

నేడు జడ్పీ సమావేశం

బడ్జెట్‌తోపాటు రెండు శాఖలపై చర్చ

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ప్రధానంగా 2025-26 బడ్జెట్‌ను జడ్పీ పాలకులు ఆమోదించనున్నారు. ఈ మేరకు బడ్జెట్ రూపకల్పనకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. అలాగే వేసవి కావటంతో జిల్లాలో మంచినీటి సరఫరాపైనా ప్రధానంగా చర్చ జరగనుంది. ఆ తర్వాత అజెండాలో జిల్లా వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా తదితర ప్రభుత్వ శాఖలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. మంత్రులతోపాటు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

21 మంది ఉపాధి ఉద్యోగులపై క్రిమినల్ కేసులు

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన 21 మంది ఉద్యోగులు, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ డ్వామా పీడీ గంగాభవాని ఆదేశాలు జారీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి మండలంలో చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. ఉద్యోగులు, సిబ్బంది భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు బృందం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది. దీంతో ఏపీవో, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు మొత్తం 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు దుర్వినియోగమైన రూ.47,62,832 లక్షలను రికవరీ చేయాలని ఎంపీడీవో కార్యాలయానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన ఉపాధి, ఉద్యోగులపై క్రిమినల్ కేసు నమోదుతోపాటు నిధులను రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వీఎస్‌యూలో అన్ని ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం

‘సోమశిల’కు భద్రతాలోపం

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

8 లో..

మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీగా శాంతి

● నెలరోజులు సెలవుపై నాగేశ్వరరావు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్(జేడీ)గా డాక్టర్ కే. శాంతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగేశ్వరరావు అనారోగ్య కారణాలతో నెలరోజులు సెలవుపై వెళ్లారు. దీంతో విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీగా విధులు నిర్వహిస్తున్న శాంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె మే 27 వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు.

కందలపాడు తిప్పపై మాఫియా కన్ను

- గ్రావెల్ తరలించేందుకు ప్రయత్నాలు
- మధ్యవర్తులుగా పోలీసుల రాయబారం?
- గ్రామస్థులు, రైతులతో పలుదఫాలు చర్చలు
- చావనైనా చస్తాంగాని ఒప్పుకోమంటున్న కర్షకులు
- అయినా ముమ్మరంగా ప్రయత్నాలు



కందలపాడు గ్రామంలోని తిప్ప

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందలపాడు గ్రామంలో ఉన్న తిప్పపై గ్రావెల్ మాఫియా కన్ను పడింది. తిప్పను తవ్వి గ్రావెల్ తరలించేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల కొందరు ప్రత్యేక యంత్రాలు పెట్టి టిప్పర్లు, ఇతర వాహనాలు రాకపోకలకు వీలుగా అటవీ మార్గంలో ప్రత్యేక రోడ్డు నిర్మించారు. ఇది తెలుసుకున్న గ్రామస్థులు, రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అంతేగాక కలెక్టర్, మైనింగ్, పొల్యూషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అనుమతులు లేకుండా తిప్పను ఎత్తేందుకు పోలీసుల ద్వారా రాయబారాలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● అనుమతులే లేవట!

కందలపాడులో ఉన్న తిప్పను తవ్వేందుకు ఇటీవల యంత్రాలను తీసుకొచ్చారు. ఆ సమయంలో గ్రామస్థులు, రైతులు అడ్డుకుని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సూచనల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించి, మైనింగ్, పొల్యూషన్ అనుమతులు లేవని తేల్చి చెప్పారు. అయితే తిప్పను ఎత్తేందుకు తమపై పోలీసుల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారని అధికారుల వద్ద గ్రామస్థులు, రైతులు వాపోయారు. దీంతో అధికారులే పోలీసులకు ఫోన్ చేసి మరీ అనుమతులు లేకుండా మైనింగ్ చేపడితే వాహనాలు సీజ్ చేయాలని సూచించారు. కానీ ఈ ఆదేశాలు వారి చెవికెక్కలేదు. మళ్లీ గ్రామస్థులు, రైతులతో పోలీసులు రాయబారాలు సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రాయబారానికి వచ్చిన పోలీసులు, కొందరు నేతల ఎదుటే గ్రామస్థులు, రైతులు తాము చావడానికైనా సిద్ధమని, తిప్ప జోలికి వస్తే సహించేదే లేదని హెచ్చరించారు. దీంతో వారంతా చేసేది లేక వెనుతిరగాల్సి వచ్చింది.

● మంత్రి లోకేష్‌కు, కలెక్టర్‌కు వినతులు

మైనింగ్ తవ్వకాలను రద్దు చేయాలని కోరుతూ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఇటీవల వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు, కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులకు పలు మార్లు గ్రామస్థులు, రైతులు వినతిపత్రాలు అందజేశారు. తిప్ప చుట్టూ ఉన్న కొండపోరంబోకు భూమిలో కూరగాయలు, నిమ్మ చెట్లు, వరి వంటి పంటలు సాగు చేసుకుంటూ సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. 2022లో అప్పటి వైసీపీ హయాంలో అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు, రైతులంతా ఏకమై మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకించారు. అధికారుల ఎదుటే పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ క్యాన్లు చేతబట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తాజాగా మళ్లీ మాఫియా రంగంలోకి దిగడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును వెళ్లబోసుకుంటామని, అవసరమైతే న్యాయ పోరాటం చేసైనా తిప్పను కాపాడుకుంటామని కందలపాడు గ్రామస్థులు, రైతులు హెచ్చరిస్తున్నారు.



అడవిలో యంత్రాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గం

నేడే పాలిసెట్!

● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరులో 5, ఆత్మకూరులో 2, కావలిలో 3, కందుకూరులో 2 కేంద్రాల్లో బుధవారం పరీక్ష జరగనుంది. ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తుండగా, విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందుగానే అనుమతిస్తారు. నెల్లూరులో 2,599 మంది, ఆత్మకూరులో 527, కావలిలో 596, కందుకూరులో 351 మంది మొత్తం 4,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కఠిన నిబంధనలను అమలు చేస్తూనే పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ఏసుదాసు తెలిపారు. హాల్‌టికెట్‌తోపాటు ఫొటో ఆధారిత ధృవపత్రంతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్‌తోపాటు ఇతర అధికారులు కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



నగరంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్, అధికారులు

పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో గండిపాళెం, ఉదయగిరి, శకునాలపల్లి పంచాయతీల్లో చలివేంద్రాలు ప్రారంభించామని, మిగిలిన పంచాయతీల్లో సైతం త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9264
వెండి కిలో ధర	రూ. 1,00,300
వెండి ఒక గ్రాము	రూ.103.30

దశాబ్దాల కలకు సాకారం... పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం

● రేపు ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఆత్మకూరు ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న పారిశ్రామిక ప్రగతి కల సాకారం కాబోతుంది. ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలో పారిశ్రామవాడకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. నారంపేట సమీపంలో 173.72 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో మొదటి విడతగా సుమారు రూ. 30 కోట్ల రూపాయల మేర నిధుల మంజూరయ్యాయి. ఆనిధులతో 87 ఎకరాల్లో మాత్రం కేవలం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. మిగిలిన 67 ఎకరాలు అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పారిశ్రామికవాడ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కొలిక్కి వచ్చింది. 67 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నీటి వసతి కోసం రూ. 13 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈక్రమంలో కేంద్రప్రభుత్వం రూ. 10.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 12.93 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. రూ. 8 కోట్లతో మిగిలిన రోడ్లు, డ్రైన్లు పూర్తయ్యాయి. విద్యుత్, నీటి వసతి కల్పించాల్సి ఉంది. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారంపేట వద్ద ఇండస్ట్రీయల్ పార్కులో పైలాన్ ఆవిష్కరించనున్నారు. దీంతో త్వరలో పరిశ్రమలు ఏర్పాటు కానుండడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం

ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చే దిశగా ఆత్మకూరు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల అభివృద్ధి, సోమశిల హైలెవల్ కెనాల్, ఆప్రాన్ ఇతర మరమ్మతు పనులు, సోమశిల ఆలయం అభివృద్ధి పనులు, సంగం బ్యారేజి నుంచి నేషనల్ హైవేకు కనెక్టివిటీ, విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజి, నెల్లూరుపాళెం వద్ద నగరవనం, పది ఎకరాల్లో క్రీడా వికాసకేంద్రం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఆయా శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేసి బుధవారం మంత్రి ఆనంకు అందజేయనున్నారు.



ఎంఎస్ఎంఈ పార్కులో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న శిలాఫలకం

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం ఆవశ్యకతను వివరిస్తున్న ఇన్‌చార్జి లైబ్రేరియన్

ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత గ్రంథపాలకుడు ఏ గోవిందొరెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు, పుస్తక పఠనం వలన లాభాల గురించి విద్యార్థులకు, పాఠకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివారాజు, రికార్డు అసిస్టెంట్ తనూజ పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఓ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం హిందూ పాఠశాలలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు

●అనంతసాగరం : విద్యార్థులు నీతి కథల్లోని మంచిని గ్రహించి ఆ దిశగా మెలగితే మంచి భవిషత్తు ఉంటుందని స్థానిక సచివాలయం సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మురళి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా నీతి కథలపైపోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమలో గ్రంథపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

●వింజమూరు: గ్రంథాలయాలు చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని రిటైర్డ్ పోస్టల్ జనరల్ మేనేజర్ వెలుగోటి రాములు అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణరావు ఏఈలకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వేసవిని దృష్టిలో స్థానిక కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చేతిపంపుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, మరమ్మతులకు గురైన చేతిపంపులు, మంచినీటి పథకాలను వెంటనే బాగు చేయించాలన్నారు. చేతిపంపులకు అవసరమైన విడిభాగాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందో లేదో పరిశీలించి లేనివారు మరుగుదొడ్డి నిర్మించుకునేలా చైతన్యపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మర్రిపాడు మండల సమావేశం

మర్రిపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన మర్రిపాడు మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షన జరిగిన సమావేశాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌బాస్కర్ నిర్వహించారు. మండలంలో 12మంది ఎంపీటీసీలు ఉండగా ఆరుగురు హాజరయ్యారు. 23మంది సర్పంచ్‌లకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. వీరు సంతకాలు పెట్టి కాసేపటికే వెళ్లిపోయారు. పలుశాలఖ అధికారులు డుమ్మాకొట్టారు. రెవెన్యూ సమస్యలపై తహసీల్దారు అనీల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 600 నోషనల్ ఖాతాలు కలిగి ఉన్నారని, వారు తమ భూములకు సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే రెగ్యులర్ నెంబర్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయాధికారి రామ్మోహన్ వ్యవసాయ పనిముట్ల గురించి వివరించారు. ఎరువులు పిచికారీ చేసే డ్రోన్‌లను మండలానికి మూడు మంజూరు చేయాలని ఓ ఎంపీటీసి కోరారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిశీలన

సీతారామపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంపద సృష్టి కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని కొన్ని తొట్లల్లో వానపాములను, తొట్లల్లో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండడం వలన వానపాములు చనిపోకుండా తేమ ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. మండల పరిధిలోని పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా ఆ గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ హాస్టల్ మరమ్మతుల పరిశీలన

సీతారామపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను మంగళవారం డీఈ మదన్‌కుమార్, ఏఈ మస్తాన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు పలె సూచనలు సలహాలు ఇచ్చారు.

మెట్టుకూరు ధనుంజయరెడ్డికి అభినందనలు



మెట్టుకూరు ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న సంగం నాయకులు

సంగం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు డీసీసీబీ చైర్మన్‌గా నియమించబడ్డ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని నెల్లూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సంగం టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, సంగం పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు బాబు, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, పిట్టు పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాధిద్దాం : ఎమ్మెల్యే కాకర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సమిష్టిగా కృషిచేసి గ్రామ స్వరాజ్యం సాధిద్దామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఏ కిస్తీపురం పంచాయతీలో టీడీపీ గ్రామ కమిటీ ఏర్పాటుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వరు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు జీ.కొండారెడ్డిపల్లికి రాక

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలోని జీ.కొండారెడ్డిపల్లి గ్రామానికి బుధవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తొలుత ఇటీవల గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభిస్తారన్నారు. అనంతరం వైసీపీ నాయకుడు మూలె వీరారెడ్డితో పాటు ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించడం జరుగుతుందన్నారు.

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి : ఈఈ

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టి వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ మోహన్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి మండలంలో 104 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందజేసిందన్నారు. అందులో కేవలం 12 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేసేలా చూడాలన్నారు. కొండాయపాళెం లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ చేపట్టిన ఇళ్లనిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభమవుతాయన్నారు. వారికి సైతం ప్రభుత్వం రూ.50 వేలు అదనపు సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ పీరా, ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



ఆత్మకూరు : రిలే దీక్షలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా కండక్టర్లు, ఎన్ఎంయూ నేతలు

ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ (ఎన్ఎంయు) ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరాయి. పలువురు ఎన్ఎంయు నేతలు, మహిళా కండక్టర్లు రిలేదీక్షలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు నాయకులు మస్తానయ్య, పద్మారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్య క్రమంలో ఎన్ఎంయు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రెండో రోజైన మంగళవారం రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలాం, మౌలాలీ, నాగరాజు, మునీర్, సూర్యనారాయణ, ఆరీఫ్, బాష తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి : సీపీఎం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, సీపీఎం నేతలు

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోర్డులను రద్దుచేయాలని కోరుతూ వచ్చే నెల 20వ తేదీన కార్మిక, కర్షక సంఘాలు చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ, సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహించారు. తొలుత సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాసే దిశగా ప్రయత్నిస్తున్నాయన్నారు. మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. దేశవ్యాప్త సమ్మెకు వామ పక్ష పార్టీలు, రైతుసంఘాలు మద్దతివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, నాయబ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కశ్మీర్ మృతులకు ఘన నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులతో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా ల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముం దస్తు చర్యలు తీసుకోవడంతోపాటు మరమ్మ తులకు గురైన చేతిపంపులను బాగు చేయిం చాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి వారి ప్రగతిని సమావేశంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దారు నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపాలి

వింజమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీపీకేఆర్ ఎస్టీ కాలనీలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల సూచన మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు గొలగమూడి ఆశ్రమ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మీ తెలిపారు. ఇందులో భాగంగా కాలనీలోని సుమారు 300 ఇళ్లల్లో పిల్లలను వివరాలు సేకరించామని, పిల్లలను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచనలు సలహాలు ఇస్తున్నామని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేటినుంచి అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నిర్మించిన అంకాళమ్మతల్లి ఆలయంలో బుధవారం నుంచి జీర్ణోద్ధరణ సహిత నూతన విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. తొలిరోజు బుధవారం అంకాళమ్మ తల్లి, పోతురాజు స్వామివార్ల విగ్రహాలతో గ్రామోత్సవం జరుగుతుందన్నా రు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

●దుత్తలూరు(ఉదయగిరి) : మండలంలోని సోమలరేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవస్థానంలో బుధవారం నుంచి శనివారం వరకు నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి : సీడీపీవో

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు సంబంధించిన అన్నిరకాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని సీడీపీవో సునీత సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వడదెబ్బకు గురికాకుండా తగు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. అర్హులైన విద్యార్థులను కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

జగనన్న లేఅవుట్ల తనిఖీ

కలువాయి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలువాయిలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లలో మంగళవారం డ్వామా క్వాలిటీ కంట్రోలు అధికారులు తనిఖీలు నిర్వహించారు. వెంకటరెడ్డిపల్లి, కుల్లూరులోని లేఅవుట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల లేఅవుట్‌లలో క్వాలిటీ కంట్రోలు సిబ్బంది తనిఖీలు సక్రమంగా చేశారా లేదా అని తెలుసుకునేందుకు తనిఖీలు చేసినట్లు జూనియర్ క్వాలిటీ కంట్రోలు అధికారి తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థుల సౌకర్యార్థం సప్లిమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖంపలతో మాట్లాడుతూ మండలంలోని గడిపాళెం, ఉదయగిరి, గడ్డంవారిపల్లి, బిజ్జంపల్లి క్లస్టర్ కేంద్రాల్లో విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫిష్ పాండ్ పనుల పరిశీలన

వింజమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వింజమూరులోని ఉత్తర హరిజనవాడ ప్రాంతంలో ఉపాధి హామీ పనులలో భాగంగా జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను ఏపీవో సుభాషిణి పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల మస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట క్షేత్ర సహాయకులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు

సంగం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని గురుకుల పాఠశాలల డీసీవో పద్మజ, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక గురుకుల పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు తప్పామని కలత చెందకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతమ్మ, అధ్యాపకులు ఉన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ నన్ను అనే యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి తన ప్రతినిధులచే రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

C.R.I.M.E N.E.W.S

చోరీని దాచబోయి.. అడ్డంగా దొరికిపోయారు!

● పామాయిల్ అమ్ముకున్నారు..

● కాలువలో పడిపోయిందని నమ్మించారు..



కాలువలోకి తోసేసిన పామాయిల్ ట్యాంకర్

ముత్తుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్‌లో పామాయిల్‌ను చోరీ చేసి అమ్ముకుని.. ఆపై యాక్సిడెంట్ జరిగింది..ఇన్సూరెన్స్ అప్లై చేసుకోవాలంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మోసగాళ్ల గుట్టును ముత్తుకూరు పోలీసులు రట్టు చేశారు. చోరీని దాచేసి మోసం చేద్దామ ని ప్రయత్నం చేసిన నిందితులు అడ్డంగా దొరికి పోయారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గత బుధవారం పంటపాలెంలోని సౌత్ ఇండియా పామాయిల్ కంపెనీ నుంచి బెంగుళూరులోని సౌభాగ్య ఫుడ్స్‌కు ఆవుల నాగార్జున అనే ట్రాన్స్‌పోర్టర్ 24టన్నుల పామాయిల్‌ను బుక్ చేశారు. వెంకటాచలంకు చెందిన వలిపి వెంకటేశ్వర్లు తన సొంత ట్యాంకర్లలో ఆయిల్‌ను లోడ్ చేసుకుని బెంగుళూరుకి తీసుకువెళ్లాడు. గురువారం ట్యాంకర్‌కు కొమ్మలపూడి వద్ద యాక్సిడెంట్ అయి పక్కనే ఉన్న కాలువలో పడిపోయిందని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించేందుకు సంఘటన స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ విశ్వనాథరెడ్డికి ఈ సంఘటనపై అనుమానం కలగడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి తన బృందంతో కలిసి లోతుగా విచారణ చేపట్టారు. ట్యాంకర్‌లోని 24టన్నుల ఆయిల్ ఎట్లా పోయింది.. అనే దిశగా ప్రారంభమైన విచారణలో పలు ఆశ్చర్యం కల్పించే పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. లోతైన విచారణ అనంతరం వలిపి వెంకటేశ్వర్లు మరో ఐదు మంది వ్యక్తులతో కలిసి ట్యాంకర్‌కు మార్చి పిడుగురాళ్లలో రూ.32లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ట్యాంకర్ ప్రమాదవశాత్తు కాలువలో పడినట్లు సృష్టించేందుకు కొమ్మలపూడి వద్ద కాలువలోకి నెట్టివేశారు. ఆపై ఏమీ తెలియనట్లు ఇన్సూరెన్స్‌కి అప్లై చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయిల్ చోరీని దాచే ప్రయత్నంలో చేసిన వారు చేసిన పొరపాట్లను పసికట్టిన ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి బృందం వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. ప్రధాన నిందితుడు వలిపి వెంకటేశ్వర్లుతో పాటు దోపిడీలో పాల్గొన్న వెంకటాచలం మండలానికి చెందిన శివాజీ, చిరంజీవి, నారాయణలతోపాటు పిడుగురాళ్ల రవికుమార్, వెంకటకృష్ణలను అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

భార్య హత్యకేసులో జీవితఖైదు

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):అనుమానంతో భార్యను హత్య చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో గుత్తి యాకోబ్‌కి జీవితఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ (ఇన్‌చార్జి) న్యాయాధికారి జీగీత మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, కొడవలూరు మండలం మిక్కిలింపేటకు చెందిన శ్యామలను చెల్లారి చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. ఇద్దరు పిల్లలు పుట్టాక వారు విడిపోయారు. అనంతరం ఆమె పుట్టింటికి చేరింది. ఈనేపథ్యంలోనే ఆమె భర్త మరణించాడు. శ్యామల కీలుగుర్రాల డ్యాన్సర్‌గా ఉండేది. ఆ సమయంలో అమెకు బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన గుత్తి యాకోబ్‌తో పరిచయం ఏర్పడింది. యాకోబ్ అప్పటికే పలు దొంగతనాల కేసుల్లో జైలుజీవితం గడిపివచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరూ వివాహం చేసుకుని ఒకేఇంటిలో ఉండేవారు. పుట్టింటిలో కీలుగుర్రాల ఆటకు వెళుతున్నానని చెప్పి ఆమె యాకోబ్ వద్దకు వెళ్లింది. 2021 సెప్టెంబరు 16న రాత్రి శ్యామల తెల్లగుంటలో హత్యకు గురయినట్లు ఆమె తండ్రి కరేటి పిచ్చయ్యకు ఫోన్ వచ్చింది. దీంతో పిచ్చయ్య బోగోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసుల విచారణలో యాకోబ్ ఆమెను అనుమానంతో చీరను మెడకు చుట్టి హత్య చేసినట్లుగా తేలింది. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలుశిక్షతోపాటు జరి మానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే.విజయలక్ష్మి వాదించారు.

పోలీసు కస్టడీకి హత్య కేసు నిందితులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):నగరంలోని ప్రగతీనగర్‌లో జరిగిన హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపిన నిందితులను, విచారణ నిమిత్తం దర్గామిట్ట పోలీసులు మంగళవారం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈనెల 14న కారు డ్రైవర్ వాసు హత్య కేసులోని తొమ్మిదిమంది నిందితులను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపారు. తదుపరి విచారణ నిమిత్తం కోర్టు ఆదేశాలతో వారిని పోలీసులు ఒక్కరోజు కస్టడీకి తీసుకొని విచారించారు. వాసు హత్య కేసుతోపాటు ఇంకా ఏమైనా కేసుల్లో వీరికి ప్రమేయం ఉందా.. హత్య కేసులో వేరేవరి ప్రమేయం ఏమైనా ఉందా...? అని పలు కోణాల్లో పోలీసులు వారిని విచారించారు.

దారి కాచి

యువకుడిని హతమార్చారు!

● బుచ్చిమండలం నాగాయగుంటలో దారుణం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని బైక్‌లపై వచ్చిన ఆరుగురు కాపుకాచి వెంబడించి నడిరోడ్డుపై కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఘటన నాగాయగుంట శివారులో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇస్కపాళెం పంచాయతీ పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన ఎస్‌కే రసూల్ కొడుకు ఎస్‌కే పెద్ద రఫీ (44)కి అదే గ్రామంలోని మరోవర్గంతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పెద్దరఫీని హతమార్చేందుకు ప్రత్యర్థులు పథకం వేశారు. బావిమిట్ట ప్రాంతంలో తన ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతుండగా డ్రైవర్‌కు భోజనం తీసుకెళ్లేందుకు రఫీ తన అనుచరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై వెళుతున్నాడు. మార్గమధ్యలో ప్రత్యర్థులు కనిపించడంతో మరోమార్గంలో రఫీ మరో మార్గంలోకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన ఆరుగురు యువకులు రెండు బైక్‌లపై వెంబడించి నాగాయగుంట, కొత్త ఒంగల్లు రోడ్డు వద్ద అడ్డగించి రఫీని కొయ్యితో తలపై కొట్టారు. అంజయ్యను చంపేస్తామనడంతో ఆయన పరారయ్యాడు. రఫీని కత్తితో విచక్షణారహితంగా పొడిచి, తలపై పెద్దరాయి వేసి చనిపోయాడని నిర్ధారించుకున్నాక ఆ ఆరుగురు పరారయ్యారు. విషయం తెలుసుకున్న నాగాయగుంట యువకులు ఘటనా స్థలానికి చేరుకుని కొనఊపిరితో ఉన్న రఫీని ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంలో విచారించారు. రఫీ తల్లిదండ్రులు, బంధువులు బుచ్చి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నాగాయగుంట వద్ద హత్య జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. భారీగా పోలీసు బలగాలు బుచ్చితో పాటు పోలినాయుడు చెరువు గ్రామానికి చేరుకున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100):	435



చామదలలో డ్రోన్ సాయంతో పోలీసు నిఘా

జలదంకి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చామదలలో మంగళవారం ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా ఆధ్వర్యంలో డ్రోన్‌తో ప్రత్యేక నిఘా నిర్వహించారు. కలిగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఇద్దరు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది గ్రామంలో డ్రోన్‌తో సర్వే చేశారు. గ్రామంలో పేకాట, కోడిపందేలు లాంటి అసాంఘిక కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నా అని నిఘా చిత్రాలు తీసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేసినా డ్రోన్ నిఘాలో కనిపెట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

వారంరోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని హైవే రోడ్డులో టవర్ల ఏర్పాటు జరుగుతున్నందున రుద్రకోట, సర్వాయపాలెం ఫీడర్లలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వారంపాటు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే రుద్రకోట సర్వాయపాలెం ఫీడర్ల నుంచి రైతులకు ఉదయం 4:30నుంచి సరఫరా ఉంటుదని చెప్పారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

లింగసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ సూచించారు. సోమవారం మండలంలోని పెదపవని, ముత్యాలపాడు రైతు సేవా కేంద్రాలలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు నజీర్, ప్రేమ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ పేటలో విషాదం

● మరణంలో కూడా విడిపోని స్నేహితులకు కన్నీటి వీడ్కోలు

బిట్రగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో మంగళవారం విషాద చాయలు అలుముకున్నాయి. రాజుపాలెం జాతీయ రహదారిపై లారీ ఢీకొని మృతి చెందిన రామస్వామిపాలెం బత్తుల ప్రవీణ్‌కుమార్ (26), ఇబ్రహీంపేట షేక్ మన్సూర్ (27)ల మృతదేహాలను శవ పంచానామా అనంతరం కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహితులు, బంధువులతోపాటు ప్రజాప్రతినిధులు తరలివచ్చి నివాళులర్పించారు. మరణంలో కూడా విడిపోని స్నేహితుల పార్థివదేహాలను చూసిన స్థానికుల కళ్లు చమ్మగిల్లాయి. అలాగే గుండెపోటుతో మరణించిన సీనియర్ సిటిజన్ డోలా పురుషోత్తం (81) అంత్యక్రియల్లో రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కుటుంబసభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ



హెల్మెట్ అందజేస్తున్న డాక్టర్ రామస్వామి

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించి ప్రమాద సమయంలో ప్రాణ రక్షణ పొందాలని కావలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందరరావు తెలిపారు. ప్రొఫెషనల్ ఫొటోఅండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కావలిలో హెల్మెట్ దారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంకురోడ్డులోని భాష్యం స్కూల్ నుంచి ఐలవ్ కావలి సెల్ఫీ పాయింట్ వరకు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రామస్వామి 300 మంది ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లకు సొంత నిధులతో హెల్మెంట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శి చిలకపాటి మధుబాబు, ఉపాధ్యక్షులు హనూక్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అభినందన

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన రామాల వైష్ణవి (593), గుర్ర ముఖేష్ (592)లను సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే భవిష్యత్తులోను ఇదే పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల ఆర్ఐ అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బీ సురేష్, డీన్ బ్రహ్మయ్య, శివయ్య, ఏఓ సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దారి పొడుగునా అంగళ్లు!

మాలకొండ మార్గంలో విచ్చలవిడిగా దుకాణాలు

భక్తుల రాకపోకలకు అసౌకర్యం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ముఖద్వారం వద్ద నుంచి కొండపైకి మెట్లమార్గంలో భక్తులు నడిచి వెళ్లే రహదారిపై ఇష్టనుసారంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో భక్తులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాలకొండకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి శనివారం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. వారిలో కొంతమంది భక్తులు మెట్లమార్గంలో కొండ కింద ముఖద్వారం వద్ద నుంచి మెట్లకు పసుపు కుంకుమతో పూజిస్తూ వెళ్తుంటారు. అలాంటి సమయంలో రహదారిపై దుకాణాలు నిర్వహిస్తుండంతో వాహనదారులు భక్తులు ఎదురెదురుగా వచ్చే సమయంలో పక్కకు వైదొలిగే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి భక్తులకు ఇబ్బందులు లేకుండా దుకాణాలను రహదారిపై నుంచి వెనుకకు పెట్టించాలని భక్తులు కోరుతున్నారు.



'దామిశెట్టి'కి రెడ్‌క్రాస్ నివాళి



దామిశెట్టి శ్రీనివాసులు నాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం కావలి రెడ్ క్రాస్ జీవితపోషక సభ్యులు, వాక్సిన్ సెంటర్ దాత దామిశెట్టి శ్రీనివాసులు నాయుడి సంతా ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ బాధ్యులు ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఉపా ధ్యక్షులు బెజవాడ రవికుమార్ మాట్లాడారు. శ్రీనివాసులు నాయుడు చిన్నతనం నుంచి కష్టపడి పారిశ్రామిక వేత్తగా విద్యాదాతగా ఎదిగారని గుర్తుచేశారు. రెడ్‌క్రాస్ పోషకసభ్యు లు రఘుకుమార్ రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, జేవీవీ అధ్యక్షులు తోట వెంకటేశ్వ ర్లు, గాదిరెడ్డి మురళీ క్రిష్న తదితరులు శ్రీనివా సులు నాయుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యు లు కలికి శ్రీహరిరెడ్డి, కే. హరినారపరెడ్డి, ఓరు గంటి వెంకటేశ్వర్లు, బీఎస్ ప్రసాద్, ప్రణీత. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పేటలోని విశ్రాంత పోస్ట్‌మాస్టర్ కొల్లిపొర కోదండరామయ్య సతీమణి సుగుణమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మంగళవారం గ్రామానికి వెళ్లి కుటుబసభ్యులను పరామర్శించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు నెల్లూరు నరసారెడ్డిని కలుసుకొని క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. కార్యకర్మంలో మేడా కృష్ణారెడ్డి, బిట్రగుంట చైతన్య, వెంకటేశ్వర్లురెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, ఇస్మాయిల్, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీద రవిచంద్ర

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించటానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుట్టుశిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ మండలం, పట్టణ పరిధిలోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళా సాధికారత లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో మహిళలకు 90 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వటంతో పాటు వారికి ఉచితంగా కుట్టుమిషన్ కూడా అందజేయటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కోసం విచ్చేసిన మహిళలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు బీసీ కార్పోరేషన్ ఈడీ నిర్మలాదేవి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం డిపో ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. రెండోరోజు దీక్షలను లోక్‌సత్తా నాయకుడు మాలకొండారెడ్డి ప్రారంభి మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని. సర్క్యులర్ 1-2019ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే నిలిపివేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు కుందుర్తి వెంకటేశ్వర్లు,సహాయ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి వెంకయ్య, డిపో కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి ఎం.ఎ.కలామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ సుబ్బయ్య, కమిటీ సభ్యులు ఎం.చెన్నారెడ్డి, డోలా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎడగారుకు కేఎన్ఎం అనుకూలం

● పెన్నా డెల్టాలో 70 శాతం కేఎన్ఎం 1638 సాగు ● ప్రత్యామ్నాయంగా కేఎన్ఎం 733 రకం ఎంపిక ● జిల్లాలో విత్తన సేకరణలో రైతుల నిమగ్నం

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలోని 3.69 లక్షల ఎకరాల్లో ఎడగారు సాగుకు ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహించి 41 టీఎంసీల సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రైతులు అనుకూలమైన వరి విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఎడగారులో అధిక ఉష్ణోగ్రతను తట్టుకోవడం, కోతల సమయంలో వాలిపోకుండా ఉండడం, తెగుళ్లను తట్టుకోవడం, తక్కువ కాల పరిమితి, అధిక దిగుబడు లు, మార్కెట్లో గిరాకీ ఉండడం ఈ లక్షణాలు కలిగిన వరి వంగడాన్ని మాత్రమే ఎంపిక చేసుకుంటారు. గతంలో రైతులు ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి), ఎంటీయూ 1010 రకాలను అత్యధికంగా వినియోగించేవారు. అయితే ఇవి సమర్థవంతమైనవి అయినప్పటికీ దిగుబడి అనుకున్నంత రావడం లేదని రైతులు ప్రత్యామ్నాయం వైపు దృష్టిపెట్టారు.



● **కేఎన్ఎం 1638 రకంపై ఆసక్తి**

పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలో రైతులు అత్యధికంగా కేఎన్ఎం 1638 రకం వరి వంగడాన్ని సాగు చేపట్టేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అధిక ఉష్ణోగతను తట్టుకోవడం, తెగుళ్లను ఎదుర్కోవడం, దిగుబడి, మార్కెట్లో గిరాకీ కలిగిన ఈ రకం వరి వంగడాన్ని ఈ దఫా 70 శాతం మంది రైతులు సాగు చేపట్టేందుకు సిద్ధమైపోయారు. 135 రోజుల తక్కువ కాల పరిమితి కలిగిన వరి వంగడం కావడం, ఎండ తీవ్రతకు వాడిపోకుండా ఎల్లప్పుడూ పచ్చదనంతో నిండి ఉండడం, అన్నం పరంగా నాణ్యతను కలిగి ఉండడంతో ఈ రకం విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు.

● **కేఎన్ఎం 733, ఎంటీయూ 1010**

కేఎన్ఎం 1638 రకానికి ప్రత్యామ్నాయంగా దశాబ్దాల నుండి వాడుకలో ఉన్న ఎంటీయూ 1010 రకంతోపాటు కేఎన్ఎం 733 రకాన్ని రైతులు 25 శాతం విస్తీర్ణంలో పండించేందుకు సిద్ధంగా ఉన్నారు.. కేఎన్ఎం 733 రకం వరి వంగడం అత్యంత సన్నజాతి రకానికి చెందినది కావడంతో ఇవి నాణ్యతాపరమైన ఉత్పత్తిని ఇవ్వడంతో పాటు అధిక ధర కూడా పలుకుతాయి. అదేవిధంగా ఎంటీయూ 1010 గత నాలుగు దశాబ్దాలుగా మనుగడలో ఉన్న నమ్మకమైన వంగడం కావడంతో రైతులు దీనిని పండించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. మార్కెట్లో కూడా దీనికి నేటికీ గిరాకీ ఉండడం విశేషం. ఇవి రెండు కూడా ఉష్ణోగ్రతను, తెగుళ్లను తట్టుకొని దిగుబడి విషయంలో ఆశాజనకమైన ఫలితాలను ఇవ్వడంతో వీటిపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

● **యాజమాన్య పద్ధతులు కీలకం**

కేఎన్ఎం రకం వరి వంగడం సాగులో నారుమడి యాజమాన్యం కీలకం. వేరు వ్యవస్థ అత్యధికంగా ఉండడంతో నారు పీకే సమయంలో గట్టిదనం ఉంటుంది. నేలను గుల్లబారే విధంగా చర్యలు చేపట్టి నారును పీకాల్సి ఉంటుంది. డ్రమ్‌సీడర్ విధానంలో సాగు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. ఒక్కొక్క మొక్కగా నాటినప్పటికీ దుబ్బు బాగా విస్తరించి దిగుబడికి దోహదం చేస్తుంది.

● **విత్తనాల సేకరణలో నిమగ్నం**

ఎడగారు సాగు చేపట్టేందుకు రైతులు చేయాల్సిన మొట్టమొదటి పని విత్తన సేకరణ. ఇది అత్యంత కీలకం కావడంతో రైతులు ముందుగానే తాము ఎంపిక చేసుకున్న విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రేపో మాపో సాగు నీరు విడుదల కానున్న తరుణంలో ఇప్పటికే నారుమడులను సిద్ధం చేసుకున్న కొంతమంది రైతులు విత్తనాలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్ యంత్రం ద్వారా విత్తనాలను చల్లుకొని తద్వారా వరిసాగు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారు. కాగా అత్యధికమంది రైతులు నారుమడి యాజమాన్యంపై ఆధారపడుతున్నారు.

గిరాకీ ఉన్న వంగడం కోసం వేచి ఉన్నాం



ఎడగారు సాగులో మార్కెట్లో గిరాకీ కలిగిన వరి వంగడం కోసం వేచి చూస్తున్నాం. ఇప్పటికే కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 రకాలపై విచారిస్తున్నాం. మేలైన రకాలుగా ఇవి రెండూ కనపడుతున్న నేపథ్యంలో వీటి సాగు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. తక్కువ కాల పరిమితితో పంట పూర్తయ్యే ఈ రెండు రకాలు అనుకూలంగానే ఉన్నాయి.

- పోలిశెట్టి శ్రీనివాసులు, రైతు, ఉలవపాళ్ళ, దగదర్తి మండలం

ఎరువుల యాజమాన్యం కీలకం



ఎడగారు సాగులో ఎరువుల యాజమాన్యం కీలకం. అత్యధికంగా రైతులు కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 రకాలను సాగు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నత్రజని ఎంత వరకో అంతే వినియోగించుకోవాలి. విరివిగా వినియోగిస్తే దిగుబడి కాలంలో పరిణామాలు తీవ్రంగా ఉండి నష్టపోయే ప్రమాదం ఉంది. పైరు ఏపుగా పెరిగితే వాలిపోవడం జరుగుతుండడంతో దగ్గర దగ్గరగా నాటుకొని ఎరువుల యాజమాన్యంలో ఈ రెండు రకాలకు నత్రజని తక్కువగా వాడుకుంటే పడిపోకుండా దిగుబడి తీసుకోవచ్చు.

- దేవళ్ళ శ్రీనివాసులు రెడ్డి, రైతు, విడవలూరు, విడవలూరు మండలం.

తక్కువ కాల పరిమితి వంగడాలను వినియోగించుకోవాలి



తక్కువ కాల పరిమితి కలిగిన వంగడాలను రైతులు వినియోగించుకోవాలి. ప్రస్తుతం మార్కెట్లో కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 వరి వంగడాలను అత్యధికంగా రైతులు సేకరిస్తున్నారు. ఇవి కూడా కాలపరిమితి తక్కువ కలిగినవే. ఎరువుల యాజమాన్యం, నారుమడి యాజమాన్యంతోపాటు మెలకువలు పాటించి రైతులు సాగు చేపట్టాలి. చివరి ఆయకట్టు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి.

- వెంకటేశ్వర్లు వ్యవసాయాధికారి, అల్లూరు మండలం

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేటకు చెందిన రాగి శివకృష్ణ తన భార్య రమ్య కనిపించడంలేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలను మంగళవారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు నార్నె రోశ య్యల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద కేకు కట్‌చేసి ఉచితంగా పేదలకు భోజన ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలకపాటి మధు, గడ్డం మాలకొండయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, పువ్వాడి కోటయ్య, రావూరి రామకోటయ్య, కొత్తూరి సుధాకర్, ముప్పవరపు వేణు, పొడపాటి మహేష్, పోకూరి రాంబాబు, గుర్రం మధు, సవిడిబోయిన కృష్ణ, చుండూరి శ్రీకాంత్, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్, చెక్కా కేశవ, ఇస్కాల మధు తదితరులు పాల్గొన్నారు.

చుట్టుగుంటలో దాహం కేకలు

● నాలుగు రోజులుగా నీళ్లు రాక గ్రామస్థుల అవస్థలు



కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంటకు గత నాలుగురోజులుగా తాగునీటి సరఫరా జరగకపోవటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటితో పాటు గృహావసరాలకు కూడా నీరులేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామానికి వచ్చే మార్గంలో వాగువద్ద పైపులైను లీకేజి కారణంగా గతకొంత కాలంగా మంచినీటి పథకం ద్వారా నీటిసరఫరా సక్రమంగా జరగటం లేదని మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో నరేంద్ర దేవ్

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక ఎంపీపీ అనుమతితో వాయిదా వేసినట్లు ఎంపీడీవో నరేంద్ర దేవ్ తెలిపారు. ఎంపీపీ మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని చెప్పారు.

ప్రతి నెలా గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించాలి : ఏపీఎం

లింగసముద్రం, ఏప్రి ల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో వీవోఏలు ప్రతీ నెలా గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం కె సింహాద్రిరావు సూచిం చారు. సోమవారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంగులూరి సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపుల్లోని మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా వీవోఏలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీసీలు, వివోఎలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ అబ్దుల్ హమీద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో, అధికారులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ అబ్దుల్ హమీద్ మండల ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి అన్నారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్న తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌ను మంగళవారం ఎంపీపీ పానుగోటి మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీఓ నరేంద్రదేవ్‌తో పాటు పలువురు మండలస్థాయి అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు డేగా వెంకటేశ్వర్లు, ఇరపని సతీష్, సాధు శ్రీలత, చెన్నిబోయిన ఓబులుకొండయ్య, పిఆర్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ మధుబాబు, ఆర్‌డబ్లుఎస్ ఏఈ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలి

● వ్యాపారులతో ఎస్ఐ నారాయణ

లింగసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా షాపుల యజమానులు సహకరించాలని ఎస్సై ఎం నారాయణ కోరారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పలువురు దుకాణాల యజమానులతో మాట్లాడుతూ షాపుల ముందు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. అలాగే షాపుల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేగాకుండా బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమేరాల ఏర్పాటుకు కూడా సహకరించాలని, దీని వలన నేరాలను నియంత్రించవచ్చన్నారు. అంతేగాకుండా సైబర్ నేరాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ షేక్ నస్రుల్లా ఉన్నారు.



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ

వనితా... ఓ వ్యాపారవేత్తా..!

అతివలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని తమ ప్రతిభతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా పొదుపు ఉద్యమం ప్రారంభమైన తర్వాత డ్వాక్రా సంఘాల ద్వారా పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థిక పురోగతిని సాధిస్తున్నారు. ఇప్పటికే ఎంతో మంది పొదుపు నగదు, రుణాలతో చిరువ్యాపారులుగా మారి కుటుంబానికి చేదోడుగా ఉంటున్నారు. తాజాగా పొదుపు మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. వారికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకంగా రుణాలిచ్చి వ్యాపార రంగంలో ప్రోత్స హించేలా ప్రణాళికలు అమలు చేస్తోంది. దీంతో రకరకాల వ్యాపారాలు చేస్తూ మహిళలు ఆర్థిక పరిపుష్టి దిశాగా సాగుతున్నారు.

- మహిళలు వ్యాపారులుగా ఎదిగేందుకు ప్రభుత్వ రుణం
- ప్రతి పొదుపు సంఘం నుంచి ఒకరికి అవకాశం
- జిల్లాలో 8127 మంది ఎంపిక, శిక్షణ
- రూ.125.10కోట్ల ఆర్థిక చేయూత


కాఫీ పొడి తయారు చేస్తున్న మహిళ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మహిళల జీవనోపాధుల వృద్ధి, తలసరి ఆదాయం పెంచే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని ప్రతి పొదుపు సంఘం నుంచి ఒక మహిళను వ్యాపారవేత్తగా చేయడానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 8510 మందిని వ్యాపారంవేత్తలుగా చేయాలని లక్ష్యం నిర్దేశించింది. ఇందుకుగాను డీఆర్‌డీఏ అధికారులు 8127 మందిని ఎంపిక చేశారు. వారికి పలు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. రూ.125.10కోట్ల రుణాలను అందజేశారు.

- కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష ఉన్న పేదలు తొలుత రూ.10 లక్షలతో వ్యాపారవేత్తలుగా ఎంపికయ్యారు. ఆ తరువాత చిన్న, మధ్య తరహా వ్యాపారవేత్తలుగా, చివరికి కుటుంబ వార్షికాదాయం రూ.కోటికిపైగా ఉండేలా పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేసింది.
- జిల్లాలోని 39,382 పొదుపు సంఘాల్లో ఉన్న 4,32,894 మంది సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలను అధికారులు సేకరించారు. వారి తలసరి ఆదాయం ప్రకారం వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించే పథకానికి ఎంపిక చేశారు.
- తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల్లోని సభ్యుల నైపుణ్యాలు పెంపొందించి వారు ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడేలా చేశారు.

పలు రకాల వ్యాపారాలు...

జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు పలు రకాల వ్యాపారాల ద్వారా తమ జీవనోపాధులను మెరుగుపరుచుకుంటున్నారు. రూ.2లక్షల నుంచి రూ.20లక్షల వరకు విలువ గల వ్యాపారాలు చేపట్టారు. వీరు తీసుకున్న రుణాన్ని ఐదేళ్లలో 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. సకాలంలో చెల్లించిన వారికి మరింత రుణం అందజేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని పొదుపు మహిళలు పచ్చళ్లు, అగరుబత్తులు, కొవ్వొత్తులు, కాఫీ పొడి తయారీ, వంటనూనె తదితర వ్యాపారాలు చేస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలు...

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 25,732 గ్రూపులకు రూ.1277.13 కోట్ల బ్యాంకుల లింకేజీ రుణాలు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే లక్ష్యాన్నిమించి రూ.1369కోట్లు అందజేయడం విశేషం.

పీఎంఎఫ్‌ఎంఈ

పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద మహిళా పారిశ్రామికవేత్తలకు యూనిట్ కాస్ట్ మీద రూ.10లక్షల వరకు 35 శాతం సబ్సిడీతో రుణాన్ని అందజేస్తున్నారు. జిల్లాలో 267 మందిని ఈ పథకానికి ఎంపిక చేశారు. దీనికింద మినీ రైస్ మిల్లులు, వాటర్ ప్యూరిఫయర్ల వ్యాపారం, ఊరగాయల వ్యాపారాలను మహిళలు చేస్తున్నారు.

పీఎంఈజీపీ పథకం..

ఈ పథకం కింద కులాల వారీగా రుణాలు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 35 నుంచి 45 శాతం, బీసీలకు 30 శాతం, మిగిలిన వారికి 20 శాతం సబ్సిడీతో రుణాలు అందజేశారు. ఈ రుణాలతో ఇటుకల బట్టీలు, బియ్యం తదితర వ్యాపారాలు చేస్తున్నారు. ఇలా ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు.


అమ్మకానికి ఊరగాయలు సిద్ధం చేస్తున్న పొదుపు మహిళలు


అగరుబత్తీల తయారీ..



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు

పొదుపు సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి ఒక్కో సంఘం నుంచి ఒకరిని ఎంపిక చేశాం. పరిశ్రమల స్థాపనపై శిక్షణ ఇప్పించాం. వారు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ సంవత్సరం మరికొంత మందిని వ్యాపారవేత్తలుగా ఎంపిక చేస్తాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి లక్ష్యాల వివరాలు అందాల్సి ఉంది.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

వీఎస్‌యూలో అన్ని ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ
- హాజరుకానున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి


వర్సిటీ మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో అఖిల భారత అంతర యూనివర్సిటీల సాఫ్ట్ బాల్ టోర్నీ పోటీలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి వచ్చే నెల 3వరకు మహిళల టోర్నీ జరుగనుంది. అందుకు వచ్చిన క్రీడాకారులు మంగళవారం క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేశారు. పోటీలో మొత్తం 95 జట్లు పాల్గొననున్నాయి. నాక్ అవుట్ దశలో 91మ్యాచ్‌లు జరుగుతాయి. కేవలం లీగ్ దశకు చేరేది నాలుగు జట్లేనని, ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకు 35 మ్యాచ్‌లను నిర్వహించను న్నారు. బుధవారం సాయంత్రం ప్రారంభ వేడుకకు ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలతో పాటు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ హాజరుకానున్నారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రతిష్ఠాత్మకంగా జరుగనున్న పోటీలకు సంబంధించి షెడ్యూల్‌ను మంగళవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు.

3 నుంచి సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మే 3, 4వ తేదీల్లో అండర్-14 బాల, బాలికల సౌత్‌జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యా లయంలో మంగళవారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి హాజరయ్యే బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీలు నిర్వహించాలని కోరారు. పోటీల విజయవంతానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ భానుశ్రీ, అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ యుగంధర్, ఉపాధ్యాయులు రవిచంద్ర, లీలాధర్‌రెడ్డి, సభ్యులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, నాయకులు


నేడు వక్ఫ్ చట్టానికి నిరసన

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని ముస్లింలంతా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం రాత్రి 9 నుంచి 9.15 గంటల వరకు ముస్లింలు తమ గృహాలు, వ్యాపార సంస్థల్లో లైట్లు ఆర్పి నిరసన వ్యక్తం చేయాలని రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ పిలుపునిచ్చింది. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో జేఏసీ నాయకులు ఎండీ ఇలియాజ్, ఎస్‌డీ నవీన్‌అహ్మద్, షకీల్‌అహ్మద్, అన్వర్‌బేగ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు.

'సోమశిల'కు భద్రతా లోపం

- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆయువుపట్టు వంటి సోమశిల జలాశయానికి భద్రత లోపిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం మనుగడలోకి వచ్చి నలభై ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు ప్రత్యేక బలగాల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. ఇక రాష్ట్రంలో ప్రాధాన్యతపరంగా సోమశిల జలాశయానికి ప్రతేక గుర్తింపు ఉన్నా రక్షణ వ్యవస్థను కట్టుదిట్టం చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ కారణంగా డ్యాంకు భవిష్యత్తులో అసాంఘిక శక్తులతో ప్రమాదం



వాటిల్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో కేంద్ర నిపుణుల కమిటీ ఈ ప్రాజెక్టును సందర్శించి ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరమని సూచించి, ప్రతిపాదనలు చేయాలని కోరింది. ఆ ప్రతిపాదనలు పంపి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. నెల్లూరు జిల్లాకే కాకుండా కడప, తిరుపతి జిల్లాలతో పాటు తమిళనాడులోని చెన్నైవాసుల దాహార్తి తీరుస్తున్న సోమశిలకు రక్షణ వ్యవస్థ అనివార్యం కాగా ఉన్నతాధికారుల నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇకనైనా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో ప్రాజెక్టుకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లారైతాంగం కోరుతోంది.

కాగా, సోమశిల జలాశయంలో మంగళవారం 51.235 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కంద్రావారిపాలెంలో మంగళవారం జరిగింది. కళ్లగుంట మంజుల (45) అనే మహిళ ఇంటివద్ద నీళ్లమోటారు వేసే క్రమంలో విద్యుత్ వైర్లు కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహానికి రూరల్ ఎస్ఐ రమణయ్య పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


పెన్నాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి పెన్నాలో భారీగా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆయన తన అనుచరులతో అక్కడకు చేరుకొని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తూ మంత్రి నారాయణకు చెడ్డపేరు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఉచిత ఇసుక లక్ష్యాన్ని ఇలాంటివారు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియా వెనుక ఎవరు ఉన్నారన్నది తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణయ్య, నాని, ప్రవీణ్, శ్రీనివాసులు నాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'పశు సంచార' సేవలకు గ్రీన్‌సిగ్నల్

- నెలాఖరులోగా పశువులకు వైద్యసేవలు
- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

మనుబోలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పశు సంచార వైద్యశాలలు ఎంతగానో ఉపయోగపడేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ, మందుల పంపిణీ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంచార పశువైద్యశాలల సేవలు సగానికి సగం నిలిచిపోయాయి. వీటి ఆవశ్యకత గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెలాఖరులోగా వీటిని పునఃప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది.



1962 టోల్‌ఫ్రీ నంబర్‌తో..

108తరహాలోనే పాడిరైతులు 1962కు ఫోన్‌చేస్తే వారి గ్రామాలకు సంచార వైద్యశాలలు వెళతాయి. ఒకవేళ అత్యవసర సేవల కోసం వాటిని హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఆవును వాహనంలోకి ఎక్కించి దగ్గర్లోని పశు ప్రాంతీయ వైద్యశాలకు తరలిస్తారు. జిల్లాలోని 18సంచార వైద్యశాలల వాహనాలకు డిసెంబర్ నాటికి అగ్రిమెంట్ కుదుర్చుకున్న సంస్థ గడువు ముగియడంతో సేవలు నిలిపి వేసింది. అలాగే అత్యవసర మందుల సరఫరా, పనిచేసే సిబ్బందికి ఆరునెలల వేతనం మంజూరు చేయలేదన్న ఆరోపణలున్నాయి. రెండో విడతలో మంజూరు చేసిన సంచార వాహనాలతో అడపాదడపా వైద్య సేవలు అందేవి.


ప్రభుత్వం చర్యలు...

రాష్ట్రవ్యాప్తంగా 340సంచార వైద్యశాలల వాహనాల నిర్వహణకు టెండర్లు పిలిచింది. టెండర్లను భవ్య అనే సంస్థ దక్కించుకుంది. ఒక్కో వాహనం నిర్వహణకు నెలకు రూ.1.65లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఈ వాహనంలో వెటర్నరీ వైద్యుడు, డిప్లమో చేసిన కాంఫౌండర్, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. కాల్‌సెంటర్ నుంచి ఫోన్‌రాగానే వారి దిశానిర్దేశం ప్రకారం ఈ వాహనం ఆయా ప్రాంతాల కు తరలించి వైద్యసేవలు అందిస్తారు. ఇందులో పనిచేసే వైద్యుడికి రూ.30నుంచి 40వేలు, కాంపౌం డర్‌కు రూ.20వేలు, అటెండర్‌కు రూ. 10,500వేతనం చెల్లిస్తారు.

మూలనపడ్డ 9వాహనాలు

జిల్లాలోని సంచార వాహనాలు పశువైద్యశాలల ఆవరణంలో మూలన పడ్డాయి. నెలలరోజులు నిర్వహణ లేకపోవడంతో వాహనాల బ్యాటరీలు పాడైపోయాయి. టైర్లలో పాడై రోడ్లపై తిరగలేని పరిస్థితి. ఈ వాహనాలు రోడ్లపైకి రావాలంటే మరమ్మతులు తప్పనిసరి.

18 వాహనాలతో వైద్యసేవలందిస్తాం



జిల్లాలోని అన్ని నియోజకవర్గ గ్రామాల పశువులకు వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లాలో 9వాహనాలు నడుస్తున్నాయి. మిగిలిన 9 వాహనాలకు టెండర్ దక్కించుకున్న సంస్థ మరమ్మతులు చేసి సిద్ధం చేస్తోంది. వచ్చేనెల నుంచి జిల్లావ్యాప్తంగా వాహనాలతో పశువుల వైద్యసేవకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- రమేష్ నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

అల్లూరులో హాస్యనటులు బాబూమోహన్, సప్తగిరి


రామకృష్ణ జూనియర్ కాలేజీలో సినిమా షూటింగ్ చిత్రీకరణ

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో వారంరోజులుగా 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఆమె కథ' అను టైటిల్‌తో ఎంఎంఆర్ ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై సినిమా షూటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రంలో నటించేందుకు ప్రముఖ హాస్యనటులు బాబూమోహన్, సప్తగిరి మంగళవారం అల్లూరుకు వచ్చారు. రామకృష్ణ జూనియర్ కళాశాలలో సోమవారం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కిరణ్ మాట్లాడుతూ అల్లూరు ప్రజలు తమ చిత్ర నిర్మాణానికి పూర్తి సహకారాన్ని అందించారని, ఇక్కడ షూటింగ్ చేపట్టడం సంతృప్తిగా ఉందని తెలిపారు. హాస్యనటులను చూసేందుకు స్థానిక ప్రజలు తరలివచ్చారు.



చంద్రప్రభ వాహనంపై భగవద్రామానుజులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామానుజాచార్యుల 1008న తిరునక్షత్రం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారికి పేట ఉత్సవం జరిగింది. ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కే.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చేరదలచుకున్న అభ్యర్థులు **iti.ap.gov.in** వెబ్‌సైట్ ద్వారా ఎక్కడ చేరదలచుకున్నారో ఆ కళాశాలను ఎంపిక చేసుకుని మే 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి కేటాయించిన రిజిస్టర్ కాపీని భద్రపరచుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్‌లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో మే 26లోగా ధ్రువీకరించుకోవాలన్నారు. కౌన్సెలింగ్ జరిగే తేదీలను అభ్యర్థుల ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియచేస్తామన్నారు. సందేహాలుంటే ప్రభుత్వ బాలుర ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

బాలికల ఐటీఐలో...

వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్, డ్రెస్ మేకింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బాలికలతోపాటు బాలురకు కూడా ప్రవేశాలకు అనుమతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధి హామీ పనులపై విచారణ

సైదాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాగసరామాపురంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై మంగళవారం జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని సర్పంచు ఊసా నరసమ్మతో పాటు మరో 9 మంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటే చర్యలు తప్పవని ఏపీడీ గాయత్రీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏపీవో సురేంద్ర, టీఏ వెంకయ్య, కార్యదర్శి మాధవిలత పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9264
వెండి కిలో ధర	రూ. 1,00,300
వెండి ఒక గ్రాము	రూ.103.30

న్యూస్ బాక్స్

ప్రతిభ విద్యార్థులకు సన్మానం

పొదలకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక సభ్యుడు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సాయిబాబా మందిరంలో జరిగే కార్యక్రమంలో 500పైగా మార్కులు సాధించిన వారిని సన్మానిస్తామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు కిషోర్‌కుమార్

ఇందుకూరుపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):స్థానిక తూర్పువీధి శివాలయం సమీపంలో మంగళవారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. 104సంచార చికిత్స ప్రోగ్రాంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బీపీ, డయాబెటిస్, థైరాయిడ్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికి పరిమితమైన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. రోగులకు పైసా ఖర్చు లేకుండా ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా సేవలందిస్తామని హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుధాకర్, మాధవ, 104 సిబ్బంది లక్ష్మణ్, మహేష్, ఆశావాలంటీర్లు భాగ్యలక్ష్మీ, రమణమ్మ పాల్గొన్నారు.

ముగిసిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో జరుగుతున్న డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 31మంది హాజరు కావాల్సి ఉండగా 28మంది వచ్చినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి మధుమతి ప్రకటనలో తెలిపారు. పరీక్షలు విజయవంతంగా ముగియడానికి సహకరించిన కళాశాలల యాజమాన్యానికి, విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు.

కనుపూరు చెరువు పర్యాటకంగా అభివృద్ధి

● ప్రజా అభిప్రాయం సేకరణ

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కనుపూరు చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మంగళవారం కనుపూరులో అటవీశాఖ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జాతీయ రహదారికి అనుకుని నగరవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో చెరువులో బోట్ షికార్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు.

21చోట్ల నీటి ట్యాంకుల ఏర్పాటు

కసనానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మనుబోలు,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండలంలో జలజీవన్ మిషన్ పథకం కింద సుమారు రూ. 3కోట్లతో 21చోట్ల రక్షిత మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు మండల గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ కసనానాయక్ తెలిపారు. వేసవిలో తాగునీటిఎద్దడిపై ఆయన మాట్లాడారు.

? వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలేవీ.

! మండలంలో కేవలం కట్టువపల్లి, కొలను కుదురు గ్రామాల్లో తప్ప ఇంకెక్కడా తాగునీటి ఎద్దడి సమస్య లేదు. ఆ గ్రామాల్లో ఇటీవల సమస్యను పరిష్కరించాం. భవిష్యత్తులో రాకుండా రూ.60లక్షలతో మంచినీటి ట్యాం కు ఏర్పాటు చేయిస్తున్నాం.

? జలజీవన్ పనులు ఎలా జరుగుతున్నాయి.

! ఒకటి..రెండు కాదు.. 21చోట్ల మంచినీటి ట్యాంకులన్నీ జలజీవన్‌లో భాగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. మనుబోలు,వెంకన్నపాళెంలో శరవేగంగా పనులు చేస్తున్నారు.

? మంచినీటి ప్లాంట్ల నీటిని పరీక్షలకు పంపారా.

! ప్లాంట్ల నుంచి నీటిని సేకరించి ల్యాబ్‌లకు పంపాం. కండలేరు కాలువ సమీపంలో వేసిన నీరు బాగుంటుంది. 100అడుగుల కిందకు బోరు వేస్తేనే నీరు పడుతుంది. మనుబోలులో 50నుంచి 60అడుగుల్లోపే వేస్తారు.

చేపల కోసం నీటి తొలగింపు

● కనుపూరు చెరువులో నెల వ్యవధిలో 30శాతం నీరు ఖాళీ..!?
● అనుమతి లేకున్నా విడుదల
● ఆవేదనలో ఆరు గ్రామాల ప్రజలు



కనుపూరు చెరువులో తగ్గిన నీటిమట్టం

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):వేసవి తీవ్రంగా ఉండడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. నానాటికి ముదురుతున్న ఎండలతో భూగర్భజలాలు సైతం అడుగంటుతున్న తరుణం ఇది. ఇలాంటి సమయంలో మండలంలోని కనుమూరు చెరువులోని నీటిని చేపలు పట్టేందుకు తూముల నుంచి విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ఆరుగ్రామాల ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చేపల సొసైటీ నిర్వాహకులు కొందరు ఈ కుట్ర చేస్తున్న ఇరిగేషన్ అధికారుల్లో మాత్రం చలనం లేదు. విషయాన్ని ఫోన్ల ద్వారా అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది.

● **ఆరు గ్రామాలకు ఈ చెరువు నీరే ఆధారం**

కనుపూరు చెరువు మండలంలోని అన్ని చెరువుల కన్నా పెద్ద చెరువు. దీని విస్తీర్ణం మూడు గ్రామాలకు అనుకుని ఉంటుంది. దీని పరిధిలోని ఆరు గ్రామాలకు ఈ చెరువు నీరే ఆధారం. ఇలాంటి చెరువు నుంచి వ్యవసాయ పంటలకు కాకుండా వృథాగా నీటిని విడుదల చేస్తున్నారు. కొందరు చేపల సొసైటీ నిర్వాహకులు అధికారుల అనుమతులు తీసుకోకుండా తూములు తెరుస్తుండటంతో నీరు వృథా అవుతున్నది. ఈ చెరువులో నీరు లేకుంటే వెంకటాచలం, కనుపూరు, ఎర్రగుంట, కందలపాడు తదితర గ్రామాల్లోని భూగర్భజలాలు అడుగంటిపోతాయి. తాగునీటి బావులు, బోర్లు పూర్తిగా ఎండిపోతాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలోనే చెరువులో 30శాతానికిపైగా నీరు బయటకు వదిలారు. వీరికి నాయకుల అండదండలు ఉండటం వల్ల ఇలా చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.



తూముల నుంచి వెళ్తున్న నీరు

● **మొరపెట్టుకున్నా చర్యలేవీ..!?**

నీటి మళ్లింపుపై పలువురు గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకుండిపోయారు. ఇలానే మరో నెలరోజులు నీరు వదిలితే చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. గత నాలుగేళ్ల కిందట సొసైటీ నిర్వాహకుడు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది తో కలిసి కుమ్మక్కై నీటిని విడుదల చేసి గ్రామాలకు తీసు కొచ్చారు. వెంకటాచలంలో రెండేళ్లపాటు ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేశారు. ఆ పరిస్థితి మళ్లీ ఇప్పుడు వచ్చేలా కనిపిస్తుంది. ఇరిగేషన్ అధికారులు మేల్కొని తాగునీటి ఎద్దడి రాకముందే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

● గ్రామాల పశువులు, ఆవులు, గొర్రెలు, మేకలకు నీరు లేకుండా అన్యాయం చేయడం సరైంది కాదని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువు నుంచి దిగువకు నీరు వదలకుండా తూములకు వెల్డింగ్ చేయించాలని కోరుతున్నారు.

సమస్యలపై ఏకరువు

● మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు, సర్పంచులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ ఎం.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. పవర్ స్ప్రేయర్లు ఎక్కువ ధర పలకడం..రిపేర్లు ఎక్కువగా వుండడంతో చిన్నసన్నకారు రైతులు రైతులు తీవ్రంగాఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తరపున అలాంటి స్ప్రేయర్లు పంపిణీ చేసేలా చూడాలని వ్యవసాయాధికారిని కోరారు. ఖరీఫ్ సీజన్ మొదలౌతున్న నేపథ్యంలో నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. గత సమావేశంలో కోరి న మేరకు ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో 25శాతం పేదలకు ఉచితంగా చదవుకునే అవకాశాన్ని అమలయ్యే లా చూడాలని కోరారు. ఇటీవల మినగల్లు వద్ద పలుమార్లు ప్రైవేటు స్కూలు బస్సులు ప్రమాదాలకు గురైన విషయం గుర్తు చేశారు. స్కూళ్ల తెరచేలోపు వాహనాలు ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు పాత చేతి పంపుల మరమ్మతులతో పాటు కొత్త పంపులు ఏర్పాటు చేయాలని కోరారు. మినగల్లులో కర్మక్రతువుల నిర్మించిన మండపాన్ని కొంతమంది గ్రామస్థులు కూల్చేశారని సర్పంచు బొర్రుపూజిత ఆవేదన చెందారు. తమకు తెలీకుండానే గ్రామంలో పనులు జరుగుతున్నాయనీ కనీసం ఒక మహిళా సర్పంచు అని కూడా చూడటం లేదని ఎంపీడీఓ ముందు తీవ్రంగా ఆవేదన చెందారు. దామరమడుగు ఎంపీటీసీ మాట్లాడారు. గ్రామ సచివాలయం దగ్గర నుంచి హైస్కూలు ముందు తవ్విన గోతులతో స్థానికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామ ఎంపీటీసీ మనో రమ కోరారు. కార్యక్రమంలో సర్పంచులు రమణారెడ్డి, పెంచలయ్య, విజయమ్మ, ఎస్.నిర్మల, పూజిత తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కులం పేరును లేవనెత్తుతూ అసభ్యకర పదజాలంతో దూషిస్తూ చేతులతో కొట్టి, దుస్తులను లాగి నేలపైకి నెట్టారని ఓ మహిళా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. రామదాసుకండ్రిగ పంచాయతీలోని నాయుడుపాళెంకు చెందిన ఇందసి అనితను అదే గ్రామానికి చెందిన చల్లా హరిబాబు, చల్లా కిష్టయ్యలు కలిసి గొడవకు దిగారు. బహిరంగ ప్రదేశంలో కులం పేరుతో అసభ్యకరంగా దూషించారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రమశిక్షణ అవసరం

● లైబ్రేరియన్ రాజేశ్వరి

కొడవలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని లైబ్రేరియన్ రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. రెండోరోజు విద్యార్థులతో నీతికథలు, మహనీయుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు చదివించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వేసవి సెలవులను ప్లానింగ్ ప్రకారం ఉపయోగించు కోవాల న్నారు. ప్రతి విద్యార్థి వారిలో ఉండే ఫ్యాషన్, ప్లానింగ్, సామర్థ్యం, గోల్‌ను తెలుసుకుని ముందుకు సాగినప్పుడే విజయాలు అందుకోవచ్చని తెలిపారు. అనంతరం చిత్రలేఖనం వేయించారు. శిక్షణలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



ముత్తుకూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ

ముత్తుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):నాటి పొదుపు సంఘాల నుంచి నేటి కుట్టుమిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అని టీడీపీ మండల కార్యదర్శి నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. బలిజపాలెంలోని సచివాలయం-3లో మంగళవారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కునేందుకు ప్రభు త్వం ప్రవేశ పెట్టిన పథకాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో లబ్ధిదారులకు చేరవేస్తున్నట్లు చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ కేటగిరిలో 72మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, టీడీపీ తిరుపతి పార్లమెంటు మత్స్యకార విభాగం అధ్యక్షుడు అక్కయ్యగారి ఏడుకొండలు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పల్లికొండ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాస్‌యాదవ్, ముత్యంగౌడ్, శ్రీనివాసులు, విజయ్ ఉన్నారు.

పోలేరమ్మకి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

విడవలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చౌకిచర్లలో వెలసిన పోలేరమ్మ తల్లికి మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు ఈతూరు సురేష్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు కొమ్మిరెడ్డి కోటారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డిలు కుటుంబసమేతంగా వచ్చి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులు

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):చవటపాళెం పంచాయతీలోని సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో మంగళవారం ఎన్‌సీసీ శిబిరాన్ని నిర్వహించారు. కమాండెంట్ గణేష్ గొందగవే ఆధ్వర్యంలో వచ్చే నెల 7వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గణేష్ గొందగవే మాట్లాడారు. ముఖ్యంగా ప్రతిఒక్కరికీ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సామాజిక సేవ, దేశభక్తి, గన్‌ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణను ఉపయోగించుకుని అత్యుత్తమ పౌరులుగా ఎదిగి దేశసేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శారీరక వ్యాయామం, యోగ ఆసనాలు, నౌక నమూనా నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు తీసుకో వాల్సిన నివారణ చర్యలు, సమాచార వ్యవ స్థ, ఆయుధ శిక్షణ, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్య క్రమంలో గుండాల నరేంద్రబాబు, మల్లికార్జున్‌రెడ్డి, మస్తానయ్య, కొండారె డ్డి, సాయిశంకరి, రంజన్, లోకేష్, లక్ష్మణ్ ఉన్నారు.

ఎడగారుకు కేఎన్‌ఎం అనుకూలం

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలోని 3.69 లక్షల ఎకరాల్లో ఎడగారు సాగుకు ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహించి 41 టీఎంసీల సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రైతులు అనుకూలమైన వరి విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఎడగారులో అధిక ఉష్ణోగ్రతను తట్టుకోవడం, కోతల సమయంలో వాలిపోకుండా ఉండడం, తెగుళ్లను తట్టుకోవడం, తక్కువ కాల పరిమితి, అధిక దిగుబడు లు, మార్కెట్లో గిరాకీ ఉండడం ఈ లక్షణాలు కలిగిన వరి వంగడాన్ని మాత్రమే ఎంపిక చేసుకుంటారు. గతంలో రైతులు ఎన్‌ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి), ఎంటీయూ 1010 రకాలను అత్యధికంగా వినియోగించేవారు. అయితే ఇవి సమర్థవంతమైనవి అయినప్పటికీ దిగుబడి అనుకున్నంత రావడం లేదని రైతులు ప్రత్యామ్నాయం వైపు దృష్టిపెట్టారు.

● **కేఎన్‌ఎం 1638 రకంపై ఆసక్తి**

పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలో రైతులు అత్యధికంగా కేఎన్‌ఎం 1638 రకం వరి వంగడాన్ని సాగు చేపట్టేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అధిక ఉష్ణోగతను తట్టుకోవడం, తెగుళ్లను ఎదుర్కోవడం, దిగుబడి, మార్కెట్లో గిరాకీ కలిగిన ఈ రకం వరి వంగడాన్ని ఈ దఫా 70 శాతం మంది రైతులు సాగు చేపట్టేందుకు సిద్ధమైపోయారు. 135 రోజుల తక్కువ కాల పరిమితి కలిగిన వరి వంగడం కావడం, ఎండ తీవ్రతకు వాడిపోకుండా ఎల్లప్పుడూ పచ్చదనంతో నిండి ఉండడం, అన్నం పరంగా నాణ్యతను కలిగి ఉండడంతో ఈ రకం విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు.

● **కేఎన్‌ఎం 733, ఎంటీయూ 1010**

కేఎన్‌ఎం 1638 రకానికి ప్రత్యామ్నాయంగా దశాబ్దాల నుండి వాడుకలో ఉన్న ఎంటీయూ 1010 రకంతోపాటు కేఎన్‌ఎం 733 రకాన్ని రైతులు 25 శాతం విస్తీర్ణంలో పండించేందుకు సిద్ధంగా ఉన్నారు.. కేఎన్‌ఎం 733 రకం వరి వంగడం అత్యంత సన్నజాతి రకానికి చెందినది కావడంతో ఇవి నాణ్యతాపరమైన ఉత్పత్తిని ఇవ్వడంతోపాటు అధిక ధర కూడా పలుకుతాయి. అదేవిధంగా ఎంటీయూ 1010 గత నాలుగు దశాబ్దాలుగా మనుగడలో ఉన్న నమ్మకమైన వంగడం కావడంతో రైతులు దీనిని పండించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. మార్కెట్లో కూడా దీనికి నేటికీ గిరాకీ ఉండడం విశేషం. ఇవి రెండు కూడా ఉష్ణోగ్రతను, తెగుళ్లను తట్టుకొని దిగుబడి విషయంలో ఆశాజనకమైన ఫలితాలను ఇవ్వడంతో వీటిపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

● **యాజమాన్య పద్ధతులు కీలకం**

కేఎన్‌ఎం రకం వరి వంగడం సాగులో నారుమడి యాజమాన్యం కీలకం. వేరు వ్యవస్థ అత్యధికంగా ఉండడంతో నారు పీకే సమయంలో గట్టిదనం ఉంటుంది. నేలను గుల్లబారే విధంగా చర్యలు చేపట్టి నారును పీకాల్సి ఉంటుంది. డ్రమ్‌సీడర్ విధానంలో సాగు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. ఒక్కొక్క మొక్కగా నాటినప్పటికీ దుబ్బు బాగా విస్తరించి దిగుబడికి దోహదం చేస్తుంది.

● **విత్తనాల సేకరణలో నిమగ్నం**

ఎడగారు సాగు చేపట్టేందుకు రైతులు చేయాల్సిన మొట్టమొదటి పని విత్తన సేకరణ. ఇది అత్యంత కీలకం కావడంతో రైతులు ముందుగానే తాము ఎంపిక చేసుకున్న విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రేపో మాపో సాగునీరు విడుదల కానున్న తరుణంలో ఇప్పటికే నారుమడులను సిద్ధం చేసుకున్న కొంతమంది రైతులు విత్తనాలను కూడా సిద్ధం చేసుకున్నారు.

C.R.I.M.E N.E.W.S

చోరీని దాచబోయి.. అడ్డంగా దొరికిపోయారు !

● పామాయిల్ అమ్ముకున్నారు..
● కాలువలో పడిపోయిందని నమ్మించారు.



కాలువలోకి తోసేసిన పామాయిల్ ట్యాంకర్

ముత్తుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్‌లో పామాయిల్‌ను చోరీ చేసి అమ్ముకుని.. ఆపై యాక్సిడెంట్ జరిగింది..ఇన్సూరెన్స్ అప్లై చేసుకోవాలంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మోసగాళ్ల గుట్టును ముత్తుకూరు పోలీసులు రట్టు చేశారు. చోరీని దాచేసి మోసం చేద్దామ ని ప్రయత్నం చేసిన నిందితులు అడ్డంగా దొరికి పోయారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గత బుధవారం పంటపాలెంలోని సౌత్ ఇండియా పామాయిల్ కంపెనీ నుంచి బెంగుళూరులోని సౌభాగ్య ఫుడ్స్‌కు ఆవుల నాగార్జున అనే ట్రాన్స్‌పోర్టర్ 24టన్నుల పామాయిల్‌ను బుక్ చేశారు. వెంకటాచలంకు చెందిన వలిపి వెంకటేశ్వర్లు తన సొంత ట్యాంకర్లలో ఆయిల్‌ను లోడ్ చేసుకుని బెంగుళూరుకి తీసుకువెళ్లాడు. గురువారం ట్యాంకర్‌కు కొమ్మలపూడి వద్ద యాక్సిడెంట్ అయి పక్కనే ఉన్న కాలువలో పడిపోయిందని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించేందుకు సంఘటన స్థలానికి వెళ్లిన ఎస్ఐ విశ్వనాథరెడ్డికి ఈ సంఘటనపై అనుమానం కలగడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్ఐ విశ్వనాథరెడ్డి తన బృందంతో కలిసి లోతుగా విచారణ చేపట్టారు. ట్యాంకర్‌లోని 24టన్నుల ఆయిల్ ఎట్లా పోయింది... అనే దిశగా ప్రారంభమైన విచారణలో పలు ఆశ్చర్యం కల్పించే పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. లోతైన విచారణ అనంతరం వలిపి వెంకటేశ్వర్లు మరో ఐదు మంది వ్యక్తులతో కలిసి ట్యాంకర్‌కు మార్చి పిడుగురాళ్లలో రూ.32లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ట్యాంకర్ ప్రమాదవశాత్తు కాలువలో పడినట్లు సృష్టించేందుకు కొమ్మలపూడి వద్ద కాలువలోకి నెట్టివేశారు. ఆపై ఏమీ తెలియనట్లు ఇన్సూరెన్స్‌కి అప్లై చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయిల్ చోరీని దాచే ప్రయత్నంలో చేసిన వారు చేసిన పొరపాట్లను పసికట్టిన ఎస్ఐ విశ్వనాథరెడ్డి బృందం వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. ప్రధాన నిందితుడు వలిపి వెంకటేశ్వర్లుతో పాటు దోపిడీలో పాల్గొన్న వెంకటాచలం మండలానికి చెందిన శివాజీ, చిరంజీవి, నారాయణలతోపాటు పిడుగురాళ్ల రవికుమార్, వెంకటకృష్ణలను అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

భార్య హత్యకేసులో జీవితఖైదు


నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):అనుమానంతో భార్యను హత్య చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో గుత్తి యాకోబ్‌కి జీవితఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ (ఇన్‌చార్జి) న్యాయాధికారి జీగీత మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, కొడవలూరు మండలం మిక్కిలింపేటకు చెందిన శ్యామలను చెల్లారి చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. ఇద్దరు పిల్లలు పుట్టాక వారు విడిపోయారు. అనంతరం ఆమె పుట్టింటికి చేరింది. ఈనేపథ్యంలోనే ఆమె భర్త మరణించాడు. శ్యామల కీలుగుర్రాల డ్యాన్సర్‌గా ఉండేది. ఆ సమయంలో ఆమెకు బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన గుత్తి యాకోబ్‌తో పరిచయం ఏర్పడింది. యాకోబ్ అప్పటికే పలు దొంగతనాల కేసుల్లో జైలుజీవితం గడిపివచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరూ వివాహం చేసుకుని ఒకేఇంటిలో ఉండేవారు. పుట్టింటిలో కీలుగుర్రాల ఆటకు వెళుతున్నానని చెప్పి ఆమె యాకోబ్ వద్దకు వెళ్లింది. 2021 సెప్టెంబరు 16న రాత్రి శ్యామల తెల్లగుంటలో హత్యకు గురయినట్లు ఆమె తండ్రి కరేటి పిచ్చయ్యకు ఫోన్ వచ్చింది. దీంతో పిచ్చయ్య బోగోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసుల విచారణలో యాకోబ్ ఆమెను అనుమానంతో చీరను మెడకు చుట్టి హత్య చేసినట్టుగా తేలింది. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలుశిక్షతోపాటు జరి మానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే.విజయలక్ష్మి వాదించారు.

పోలీసు కస్టడీకి హత్య కేసు నిందితులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):నగరంలోని ప్రగతీనగర్‌లో జరిగిన హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపిన నిందితులను, విచారణ నిమిత్తం దర్గామిట్ట పోలీసులు మంగళవారం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈనెల 14న కారు డ్రైవర్ వాసు హత్య కేసులోని తొమ్మిదిమంది నిందితులను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపారు. తదుపరి విచారణ నిమిత్తం కోర్టు ఆదేశాలతో వారిని పోలీసులు ఒక్కరోజు కస్టడీకి తీసుకొని విచారించారు. వాసు హత్య కేసుతోపాటు ఇంకా ఏమైనా కేసుల్లో వీరికి ప్రమేయం ఉందా.. హత్య కేసులో వేరేవరి ప్రమేయం ఏమైనా ఉందా...? అని పలు కోణాల్లో పోలీసులు వారిని విచారించారు.

కాపుకాచి హతమర్చారు!

● బుచ్చిమండలం నాగాయగుంటలో దారుణం



మృతుడు పెద్ద రఫీ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బైక్‌లపై వచ్చిన ఆరుగురు కాపుకాచి నడిరోడ్డుపై ఓ వ్యక్తిని కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఘటన నాగాయగుంట శివారులో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన ఎస్కే రసూల్ కొడుకు ఎస్కే పెద్ద రఫీ (44)కి అదే గ్రామంలోని మరోవర్గంతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పెద్దరఫీని హతమార్చేందుకు ప్రత్యర్థులు పథకం వేశారు. బావిమిట్ట ప్రాంతంలో తన ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతుండగా డ్రైవర్‌కు భోజనం తీసుకెళ్లేందుకు రఫీ తన అనుచరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై వెళుతున్నాడు. మార్గమధ్య లో ప్రత్యర్థులు కనిపించడంతో మరోమార్గంలో రఫీ మరో మార్గంలోకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన ఆరుగురు యువకులు రెండు బైక్‌లపై వెంబడించి నాగాయగుంట, కొత్త ఒంగల్లు రోడ్డు వద్ద అడ్డగించి రఫీని కొయ్యితో తలపై కొట్టారు. అంజయ్యను చంపేస్తామనడంతో ఆయన పరారయ్యాడు. రఫీని కత్తితో విచక్షణారహితంగా పొడిచి, తలపై పెద్దరాయి వేసి చనిపోయాడని నిర్ధారించుకున్నాక ఆ ఆరుగురు పరారయ్యారు. విషయం తెలుసుకున్న నాగాయగుంట యువకులు ఘటనా స్థలానికి చేరుకుని కొనఊపిరితో ఉన్న రఫీని ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంలో విచారించారు. రఫీ తల్లిదండ్రులు, బంధువులు బుచ్చి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నాగాయగుంట వద్ద హత్య జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. భారీగా పోలీసు బలగాలు బుచ్చితో పాటు పోలినాయుడు చెరువు గ్రామానికి చేరుకున్నాయి.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100):	435

బ్రిడ్జిపై పార్కింగ్... వాహనాల రాకపోకలకు ఇబ్బంది !

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు కూడలిలో జాఫర్ సాహెబ్ కాలువపై నిర్మించిన వంతెన వాహనాల రాకపోకలకు వీలులేకుండా మారింది. ఇక్కడ దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. అయితే జనాభా, వాహనాలు పెరగడంతో రాకపోకలకు ఒకటే వంతెన సరిపోకపోవడంతో కొన్నేళ్ల క్రితం మరో వంతెన కూడా నిర్మించారు. ఒక దానిపై వెళ్లడానికి, మరోదానిపై రావడానికి అన్నట్లు ఏర్పాటు చేశారు. అయితే, నిత్యం వేలాది వాహనాలు తిరుగాడే ఈ మార్గంలో ఒక వంతెనపై కొంతకాలంగా భారీ వాహనాలను నిలిపివేస్తున్నారు. వంతెన మీద రెండు వైపులా కొందరు లారీలు, కార్లు నిలిపి దీనిని పార్కింగ్ ప్రాంతంగా మార్చేశారు. పోలీసులు కూడా ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఒక వంతెనపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.



న్యూస్ బాక్స్

రైతులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే : ఆర్డీవో

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల రీసర్వే పూర్తి చేయాలని ఆర్డీవో అనూష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో రీసర్వేపై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ణయించిన గ్రామాల్లో రీసర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. సర్వేలో గ్రామ, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, డీటీలు, తహసీల్దారులు అనుసరించాల్సిన విధివిధానాలను ఆమె గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో సర్వే శాఖ ఇన్‌స్పెక్టర్ రఘురామరాజు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):పహల్గాంలో ఉగ్రదాడిలో అశువులు బాసినవారికి నివాళులు అర్పిస్తూ జిల్లా ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్స్ అధ్యక్షుడు ఏ. నాగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని నాగులమిట్టరోడ్డులో భారత్‌మాతా కీజై మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, శివారెడ్డి, కిరణ్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ నగరంగా అమరావతి

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నగరం వేగవంతంగా పూర్తవుతుందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే తొలిసోలార్ నగరంగా అమరావతి చరిత్ర సృష్టించనున్నదని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసానికి గురయిన అమరావతి తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కి శ్రీకారం చేట్టిందన్నారు. రాజధాని పునఃనిర్మాణానికి రూ. 48 వేల కోట్లతో ప్రభుత్వం పాలనా అనుమతులు మంజూరు చేసిందన్నారు. రాజధాని పూర్తయితే రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు.

వీఎన్ఆర్ పేటలో విషాద ఛాయలు

● మరణంలోనూ విడిపోని స్నేహితులకు కన్నీటి వీడ్కోలు

బిట్రగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో మంగళవారం విషాదఛాయలు అలుముకున్నాయి. రాజుపాలెం జాతీయ రహదారిపై లారీ ఢీకొని మృతి చెందిన రామస్వామిపాలెం బత్తుల ప్రవీణ్‌కుమార్ (26), ఇబ్రహీంపేట షేక్ మన్సూర్ (27)ల మృతదేహాలను శవపంచానామా అనంతరం కుటుంబసభ్యులు మంగళవారం స్వగ్రామానికి తీసు కొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహితులు, బంధువులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తరలి వచ్చి నివాళులర్పించారు. మరణంలో కూడా విడిపోని స్నేహితుల పార్థివదేహాలను చూసిన స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే గుండెపోటుతో మరణించిన సీనియర్ సిటిజన్ డోలా పురుషోత్తం (81) అంత్యక్రియల్లో రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కుటుంబసభ్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

జీజీహెచ్‌లో రోగులపై దాడి

● ఆరుగురు పారిశుధ్య సిబ్బంది సస్పెన్షన్ ● అక్రమంగా నగదు వసూళ్లపై హెచ్చరిక ● ఆలస్యంగా వెలుగులోకి..



నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'రోగుల నుంచి నేను సెల్ చార్జింగ్ చేయించుకున్నాను... వ్యాధిగ్రస్థుల సహాయకుల నుంచి నేను నగదు వసూలు చేశాను'... అని అధికారుల వద్ద కొంతమంది పారిశుధ్య సిబ్బంది వెల్లడించినట్లు కొందరు అధికారులు చెబుతున్నారు. ఇదేమిటని మేమెందుకు డబ్బులివ్వాలని ప్రశ్నించిన వారిపై వారు దాడులు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ అధికారుల దృష్టికి రావటంతో పారిశుధ్య సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. తాజాగా సర్జికల్‌వార్డులో పెంచలయ్య అనే రోగి చికిత్స పొందుతున్నాడు. వార్డులో బాత్‌రూమ్‌లు బాగా లేవని, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా అయిందని బాధతుడి కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, భవాని చర్చించుకున్నారు. అక్రమ వసూళ్లపై ఉన్న శ్రద్ధ పారిశుధ్యంపై లేదని వారు మాట్లాడుకున్నారు. ఇది విన్న పారిశుధ్య సిబ్బంది వారితో వాగ్వివాదానికి దిగారు. దీంతో గత ఆదివారం విజయలక్ష్మి జీజీహెచ్ ప్రాంగణం బయట టీ అంగడికి రాగా, పారిశుధ్య సిబ్బంది దాడికి దిగారు. స్థానికులు ఆమెను కాపాడారు. తనపై జరిగిన దాడిపై సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌కు ఆమె ఫిర్యాదు చేశారు.

● **ఆరుగురి సస్పెన్షన్**

దీంతో సూపరింటెండెంట్ ఆరుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. రోగుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయటం సరి కాదని ఆయన హెచ్చరించారు. సస్పెన్షన్ అయిన వారిలో రేవతి, బీబీజాన్, అమల, యాలమ్మ, ధనమ్మ, శైలజ ఉన్నట్లు తెలుస్తోంది. రోగుల పట్ల మర్యాదగా మెలగాలని హితవు పలికారు.

సంతలకు నిలయం సంతపేట !



నెల్లూరు నగరంలో వివిధ గ్రామాల నుంచి రైతులు, ప్రజలు తాము ఉత్పత్తి చేసిన వాటిని సంతల్లో విక్రయించేవారు. అలా సంత ఏర్పాటు చేసుకునే ప్రాంతమే నేటి సంతపేట. ప్రస్తుతం హార్డ్‌వేర్, పెయింట్స్, శానిటరీ విభాగాల వ్యాపారాలకు నిలయంగా ఉంది. సంతపేటకు ఆ పేరు రావడానికి ఇంకొక కారణం కూడా ఉందని ఆ ప్రాంతానికి చెందిన పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో ప్రముఖ వ్యక్తి సంపత్‌రాజు ఆ ప్రాంతంలో జన్మించారు. ఆయన మంచి నటుడు, దర్శకుడు. ఆయన కీర్తిప్రతిష్టలు దృష్టిలో ఉంచుకుని స్థానికులు ఆయన పేరుతో ఆ ప్రాంతాన్ని పిలవడంతో అది కాలక్రమేణా సంతపేటగా మారి ఉండవచ్చని అంటున్నారు.

\- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

ప్రధాన వీధిలోనే పడకేసిన పారిశుధ్యం

● బుజబుజనెల్లూరులో అధ్వానంగా డ్రైనేజీ కాలువలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాదిమంది తిరిగే బుజబుజనెల్లూరు మిట్టమీద ప్రధాన రహదారిపై పారిశుధ్యం పడకేసింది. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లపక్కన, రహదారిపై ఉన్న డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతం అంతా దుర్గంధభరితంగా మారింది. అధికారులు, సిబ్బంది మాత్రం ఎప్పుడో ఒకసారి నామమాత్రంగా పర్యటించి, ఫొటోలు దిగి అప్‌లోడ్ చేసుకుంటూ చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులతో పందులు, దోమలతో తాము రోగాల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఈ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం, క్రిమిసంహార మందులను వాడడం కూడా కరువయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటన్నింటినీ సరి చేయడానికి ప్రభుత్వపరంగా ఏనాటి నుంచో పటిష్టవ్యవస్థ ఉన్నా కాలక్రమంలో జవసత్వాలుడికింది. ఇప్పటికైనా నేతలు, అధికారులు పారిశుధ్య పరిస్థితులను చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో పూడిపోయిన డ్రైనేజీ కాలువలు

సౌత్‌మోపూరును మరింత అభివృద్ధి చేస్తాం



ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సౌత్‌మోపూరులో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో రూ.16లక్షలతో నిర్మించనున్న జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పమజుల ప్రదీప్, ఉపసర్పంచి నరసయ్య, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తుళ్లూరు పెంచలయ్య, నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామయ్య, అశోక్, టీడీపీ నాయకులు శేఖర్, భాస్కర్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా ప్రచారం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా నివారించేందుకు ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టామని చైతన్య జ్యోతి వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రచార, అవగాహన కార్యక్రమాలకు మద్దతుగా సహకరించేందుకు అన్నీ మతాల నాయకులు ముందుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ప్రార్థన స్థలాల వద్ద పోస్టర్లు, బ్యానర్లు ప్రముఖంగా కనిపించేటట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఒకటి నుంచి ఉచిత యోగా తరగతులు

నగరంలోని గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో మే ఒకటి నుంచి 30 వరకు ఉచిత యోగా, ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు యోగా మాస్టర్ ముత్యాల రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని యువత, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరగతులు ఉదయం 7 నుంచి 8 వరకు ఉంటాయన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

● ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్
● 5,6 డివిజన్లలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ



మురుగు కాలువలో పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్, తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏబీసీ కేంద్రం ద్వారా వీధికుక్కల నియంత్రణకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎంసీ కమిషనర్ వైవో.నందన్ పశువైద్యులను ఆదేశించారు. నగరంలోని 5,6 డివిజన్ల పరిధిలోని వైకుంఠపురం, సత్యనారాయణపురం, స్టోన్‌హౌస్‌పేట, సాలెవీధి తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన వాక్సినేషన్ ఇప్పించాలని, శస్త్రచికిత్సలు చేసిన సమయంలో అవసరమైన ఆహారం, మందులు అందించి, ఆరోగ్యంగా అవి కోలుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు క్రమం తప్పకుండా జరగాలని అధికారులను ఆదేశించారు. బోడిగాడితోట, అహ్మద్‌నగర్ ప్రాంతాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న అపార్టుమెంట్లను పరిశీలించి బిల్డింగ్ ప్లానింగ్ అనుమతులను తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌లో అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఇంజనీరింగ్ విభాగం డీఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, పట్టణ ప్రణాళి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డిని కలిసిన మెట్టుకూరి



నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని డీసీసీబీ అధ్యక్షుడిగా నియమితులయిన మెట్టుకూరి ధనుంజయ రెడ్డి మంగళవారం కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో ఆయన్ను సత్కరించారు. సోమిరెడ్డి కూడా ధనుంజయరెడ్డిని సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో ఉత్సాహంగా చిన్నారులు



మాట్లాడుతున్న ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవరావు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇస్కాన్ మందిరంలో మంగళవారం రెండో రోజు వేసవి శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఆధ్యాత్మిక విలువలు, భక్తిభావన, పురాణకథలు, సంగీత కీర్తనలు, భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. చిన్నారులు వాటిని ఉత్సాహంగా వల్లె వేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ చైర్మన్ డాక్టర్ సుఖదేవస్వామి మాట్లాడుతూ ఈ వేసవి శిబిరాన్ని ఐదురోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇస్కాన్ మేనేజర్ రాజశేఖర్‌దాస్, ఇస్కాన్ సభ్యులు పర్యవేక్షించారు.

● **జిల్లా గ్రంథాలయంలో..**

జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు మంగళవారం ఇన్నోవేటివ్ క్విజ్, పేపర్ క్రాఫ్ట్, యోగా, పేపరు టోపీల తయారీని ప్రజా సైన్స్ వేదిక నగర అధ్యక్షుడు సతీష్‌కుమార్ నేర్పించారు. బీపాజిటివ్ సుబ్బారావు చిన్నారులకు ఇన్నోవేటివ్ క్విజ్ నిర్వహించగా, యోగా మాస్టర్ ప్రసన్న యోగా నేర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, జితేంద్ర, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ ఆలయంలో బుధవారం నుంచి జీర్ణోద్ధరణ సహిత నూతన విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. తొలిరోజు బుధవారం అంకాళమ్మ, పోతురాజు స్వామివార్ల నూతన విగ్రహాలతో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మే 1న జలాధివాసం, 2న క్షీరాధి, ధాన్యాధి, పంచశయ్యాధి వాసము, 3న కుంకుమ పూజ, బలిపీఠ స్థాపన, 4న జీర్ణోద్ధరణ సహిత నూతన విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మూడు పూటలా అల్పాహారం, అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తెలుగు కవిత్వానికి వన్నె 'చిన్ని'

● ప్రముఖులతో నారాయణరావుకి సన్మానాలు
● విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కవిత్వం మనోభావాలకు ప్రతిబింబం. ఈ విషయాన్ని గుర్తించిన కవి చిన్ని నారాయణరావు. అనతిపదాలతో అనంతమైన భావాలను పలికించే ఊహాశాలి ఆయన. కవిత్వంలో నిరాకరించిన వస్తువును తీసుకొని దాన్ని రసరమ్యంగా, మనోహరంగా చెప్పడం ఆయన ప్రజ్ఞ. వర్తమాన కవుల్లో అగ్రశ్రేణి కవిగా ప్రముఖుల నుంచి సన్మానాలు పొందారు. విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆయన రాసిన అంతర్ముఖం కవితలో.. 'ఏడారిలో నీటి కొలను నిర్మించే సామర్థ్యం నాది.. మండు వేసవిలో మంచుదనం కురిపించే ప్రతిభ నాది... నాకు కొంచెం ఆసరా ఇచ్చి చూడూ.. అవనీ తలాన్నీ స్వర్గధామం చేస్తా'.. అని ధైర్యంగా చెప్పారు.

● **9 కవితా సంపుటాల ప్రచురణ**

సాహిత్య సేవలో ఆయన వయసు 35 ఏళ్లు. 9 కవితా సంపుటాలను ముద్రించారు. మరో 3 ముద్రణలో ఉన్నాయి. కవిత్వం, సృజన, సాహితీ సేవారంగాలలో ఆయన కృషి ప్రశంసనీయం. ప్రముఖకవి నాగభైరవ కోటేశ్వరరావు, సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఆయన నాగభైరవ సాహితీ అవార్డు పేరుతో పదేళ్లుగా కవులకు సత్కారాలు అందచేస్తున్నారు. చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఏర్పాటు చేసి, కవిత్వానికి అక్షరాభిషేకం చేస్తున్నారు.

● **స్వగ్రామం తురిమెర్ల**

జిల్లాలోని సంగం మండలం తురిమెర్ల గ్రామంలో చిన్ని రామలక్ష్మమ్మ-యానాదిశెట్టి దంపతులకు 1958 జూలై 16లో ఆయన జన్మించారు. ఎంకామ్, టీఎల్, సీఎ చదివి టాక్స్ ప్రాక్టీషనర్‌గా కొనసాగుతున్నారు.

● **ఆయన రచనలు..**

జీవితం ఓ విజయం (కవితా సంపుటి), అంతర్ముఖం, మాట దీర్ఘకవిత, గుండెదీపం, గంపకూడు, కవితా సంపుటికలు, మాట సుదీర్ఘ కవితను దివర్డ్ పేరిట ఆంగ్లంలో అనువదించారు. విమర్శకుడిగా 100కుపైగా సినీ సమీక్షలు, సాహితీ వ్యాసాలను రాశారు. 'ది వర్డ్' ఆంగ్ల అనువాద కవితాసంపుటిని ఉపరాష్ట్రపతి, ఎం. వెంకయ్యానాయుడు, ఆవిష్కరించి నారాయణరావుని సత్కరించారు.

● **అందుకున్న పురస్కారాలు**

● 2018లో ఏపీ ప్రభుత్వంచే ఉగాది పురస్కారం
● 2012లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తిపురస్కారం
● శ్రీఖర, నందననామ ఉగాది కవి సమ్మేళనాల్లో సత్కారం, అవార్డు
● మాట దీర్ఘ కవితకు రావి రంగారావు జనరంజక అవార్డు
● గుండె దీపం కవితా సంపుటికి 2015లో సాహిత్య పురస్కారం
● గంప కూడు కవితా సంపుటికి గోవిందరాజు సీతాదేవి అవార్డు లభించింది.

● **బాధ్యతలు**

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్ర రచయితల సంఘానికి ముఖ్య కార్యనిర్వహణాధికారి
● డాక్టర్ నాగభైరవ అవార్డు కమిటీకి ప్రధాన కార్యదర్శి
● జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సేవలు

అసమాన ప్రతిభతో రాణిస్తున్న నారాయణరావు మరిన్ని కవితలు రాసి జనాదరణ పొందాలని ఆశిద్దాం...!



ప్రముఖ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి నుంచి అవార్డు అందుకుంటున్న నారాయణరావు(ఫైల్)




కవి చిన్ని నారాయణరావును సన్మానిస్తున్న ఉమ్మడి ఏపీ సీఎం రోశయ్య(ఫైల్)

ప్రతిభ PRATIBHA



కవిసంధ్య పురస్కారం స్వీకరిస్తూ...



తిరుపతి జిల్లా అభివృద్ధికి బంగారు బాటలు

- కృష్ణపట్నం పోర్టు, క్రిస్ సిటీలను కలుపుతూ ప్రధాన రోడ్లు
- రోడ్లు, మౌలిక సదుపాయాల కోసం రూ. 2872 కోట్లు
- ఈ డిసెంబరుకు పూర్తి కానున్న పనులు

కృష్ణపట్నం కేంద్రంగా పరిశ్రమల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ప్రణాళికలు తిరుపతి జిల్లాకు బంగారు బాటలు పరవనున్నాయి. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, బెంగళూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, సాగరమాల, భారత్‌మాల, కోస్టల్ కారిడార్.... ఇలా ప్రతిదీ కృష్ణపట్నంతో అనుసంధానం అవుతున్నాయి. కృష్ణపట్నం పోర్టును ఆధారంగా చేసుకునే ఇండస్ట్రియల్ నోడ్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 25 కిలోమీటర్ల సమీపంలో వైజాగ్-చెన్నై ఎన్‌హెచ్-16 నాలుగులేన్ల రహదారి ఉండడం, 15 కిలోమీటర్ల దూరంలోనే కృష్ణపట్నం రైల్వే స్టేషన్ ఉండడం, 90 కిలోమీటర్ల దూరంలో తిరుపతి ఎయిర్‌పోర్టు ఉండడం, చెన్నై ఎయిర్ పోర్టు కూడా 150 కిలోమీటర్ల చేరువలో ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి సోపానాలు అయ్యాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన శ్రీసిటీ, మేనకూరు సెజ్, కొత్తగా పురుడు పోసుకుంటున్న క్రిస్‌సిటీలను కలుపుతూ అద్భుతమైన రహదారులు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి తిరుపతి జిల్లా రూపురేఖలను మార్చబోతున్నాయి. రూ. 2872 కోట్లతో పనులు పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రోడ్లు, మౌలిక సదుపాయాల పనులు పూర్తయితే కృష్ణపట్నం నోడ్ పేరిట ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు సైతం వేగవంతం అవుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



భారత్‌మాల ప్యాకేజీ 3: ఈ ప్యాకేజీలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టు పురోగతిలో వుంది. తమ్మినపట్నం వద్ద కృష్ణపట్నం పోర్టు నుంచీ (కండలేరు క్రీక్ నార్త్ అండ్ సౌత్ ఇండస్ట్రియల్ క్లస్టర్) మొల్లూరు వరకూ కనెక్ట్ చేయడానికి ఆరు వరుసల రోడ్డును 15.95 కిలోమీటర్ల మేరకు పొడిగించే పనులు జరుగుతున్నాయి. రూ. 609.43 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను ఏఎంఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సంస్థ 2023 సెప్టెంబరు 25న ప్రారంభించింది. ఈ ఏడాది సెప్టెంబరుకల్లా పనులు పూర్తయ్యే అవకాశముంది.


కృష్ణపట్నం పోర్టు నుంచి మొల్లూరుకు నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు


నాయుడుపేట మండలం అన్నమేడు వద్ద (నాయుడుపేట-తూర్పుకనుపూరు మధ్య) సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు

సాగరమాల ప్యాకేజీ 4 : నాయుడుపేట నుంచీ తూర్పు కనుపూరు వరకు 34.88 కిలోమీటర్ల పొడవైన సిక్స్ లేన్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆప్కో ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 1398.84 కోట్ల అంచనాతో 2023 డిసెంబరు 20న పనులు మొదలు పెట్టింది. ఈ ఏడాది అక్టోబరుకల్లా పనులు పూర్తి కానున్నాయి.


బల్లవోలు (కాకువారిపాలెం నుంచి వరగలి వరకు) వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

క్రిస్ సిటీకి అనుసంధానం

క్రిస్ సిటీకి ఎక్స్‌టర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టు కింద పలు పనులు జరుగుతున్నాయి. బల్లవోలు దగ్గర కాకువారిపాలెం నుంచీ వరగలి వరకూ ఇపుడున్న లింక్ రోడ్డును 17 కిలోమీటర్ల మేరకు విస్తరిస్తున్నారు. ఈ లింక్ రోడ్డు ఫోర్ లేన్ రోడ్డును కలుపుతుంది.

అలాగే భారత్‌మాల కింద ఎన్‌హెచ్‌లో (ప్యాకేజీ 2, పార్ట్ 2) నాయుడుపేటను, కృష్ణపట్నం పోర్టును కలిపే మేజర్ బ్రిడ్జి -1 వద్ద చివరి షైలు కనెక్ట్ చేసే పని జరుగుతోంది. అదే ఎన్‌హెచ్‌లో మేజర్ బ్రిడ్జి-2 వద్ద చివరి షైలును కనెక్ట్ చేసే పని జరుగుతోంది. ఇవన్నీ కూడా ఈ ఏడాది సెప్టెంబరు నుంచీ డిసెంబరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలతో వ్యవహరిస్తోంది. అందులో భాగంగా పనుల పురోగతిని పూర్తిస్థాయిలో సమీక్షించింది. త్వరగా పనులు పూర్తి చేయాలంటూ సంబంధిత కాంట్రాక్టు సంస్థలను, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల వెంట జిల్లా అధికారులు పడుతున్నారు.

భారత్ మాల ప్యాకేజీ-2 పార్ట్- 1: ఈ ప్యాకేజీలో భాగంగా ఎన్‌హెచ్ 16 చిల్లకూరు క్రాస్ రోడ్డు నుంచీ తూర్పు కనుపూరు వరకూ 24.92 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దానితో పాటు ఫ్లైఓవర్, అప్రోచ్ రోడ్డుల పనులు కూడా చేపట్టారు.


చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు నిర్మాణంలో ఉన్న ఫోర్ లేన్ రోడ్డు


చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఫ్లై ఓవర్ పనులు

భారత్ మాల ప్యాకేజీ-2 పార్ట్ -2: దీని కింద తూర్పు కనుపూరు నుంచీ కృష్ణపట్నం పోర్ట్ దక్షిణ గేట్ వరకూ 11.24 కిలోమీటర్ల మేరకు సిక్స్ లేన్ రోడ్డు పనులు సాగుతున్నాయి. రూ. 864.24 కోట్ల అంచనాతో ఈ పనులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ 2023 డిసెంబరు 17న చేపట్టింది. ఈ ఏడాది డిసెంబరుకల్లా పనులు పూర్తి కానున్నాయి.


తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం దక్షిణం గేటు వరకు జరుగుతున్న సిక్స్ లేన్ రోడ్డు పనులు


నాయుడుపేట-కృష్ణపట్నం పోర్టులను కలిపే మేజర్ బ్రిడ్జి-1 అన్నమేడు గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న దృశ్యం


కోట మండలం విద్యానగర్ సమీపంలో నాయుడుపేట- కృష్ణపట్నం పోర్టులను కలిపే మేజర్ బ్రిడ్జి-2 నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

అయ్యో.. ఎంత ఘోరం

- ఐదంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీ మేస్త్రీల దుర్మరణం
- తిరుపతిలో పూత పనిచేస్తుండగా ఘటన
- మృతుల్లో బావ, బామ్మర్ది




మృతులు బి.శ్రీనివాసులు, వసంత్, కె.శ్రీనివాసులు


ఐదంతస్తుల భవనంపై నుంచి పడి మృతిచెందిన తాపీ మేస్త్రీలు


భర్త బి.శ్రీనివాసులు మృతదేహాన్ని చూసి విలపిస్తున్న ప్రమీల

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదంతస్తుల ఇంటికి పూత వేసేందుకు కట్టిన సారవ తాడు ఊడిపోవడంతో విషాదం చోటుచేసుకుంది. సుమారు 50 అడుగులకు పైనుంచి కింద పడి ముగ్గురు మేస్త్రీలు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం తిరుపతి రూరల్ తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో జరిగింది. ఇక్కడి హెచ్‌ఐజీలో ఏడాదిగా ఐదంతస్తుల ఇల్లు కడుతున్నారు. ఆ ఇంటి బయట గోడలకు మంగళవారం పూతపని మొదలు పెట్టారు. దీనికోసం కింద నుంచి పై అంతస్తు వరకు కొయ్యలతో సారవ కట్టారు. ఈ సారవపై నిలబడి గోడకు పూత పని చేస్తుండగా ఉదయం 10.40గంటల సమయంలో అడ్డసారవ కొయ్యలకు కట్టిన తాడు ఊడిపోయింది. మిగతా కొయ్యలు అటు ఇటు కదలడంతో వాటిపై నిలబడివున్న తాపీ మేస్త్రీలు.. పెళ్లకూరు మండలం అక్కగారిపేటకు చెందిన బి.శ్రీనివాసులు, జీవనోపాధి నిమిత్తం ఒంగోలు నుంచి పదేళ్ల కిందట శ్రీకాళహస్తికి వచ్చి స్థిరపడిన కె.శ్రీనివాసులు, అతడి బావమరిది టి.వసంత్ అదుపుతప్పి పడిపోయారు. సారవకొయ్యలకు, గోడకు కొట్టుకుంటూ కింద పడటంతో ఇద్దరు దుర్మరణం చెందారు. 108 అంబులెన్స్‌ను రప్పించే లోపే మరొకరు తుదిశ్వాస విడిచారు. కావలికి చెందిన మరో మేస్త్రీ మాధవ ఓ చేతితో అడ్డకర్రను పట్టుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులకు, పంచాయతీ అధికారులకు ఇంటి యజమాని సమాచారమిచ్చారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుచానూరు డీఎస్పీ బి.ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐలు బాలకృష్ణరెడ్డి, సాయినాథ్‌చౌదరి, అరుణకుమారి, తహసీల్దారు భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఉద్యోగులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ఇంటి యజమాని స్రవంతి, ఆమె మామ, విశ్రాంత ఉపాధ్యాయుడు కడివేటి ఆండాలయ్య, సారవకు తాళ్లు కట్టిన ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.


కొడుకు వసంత్, అల్లుడు శ్రీనివాసులు మృతితో విషాదంలో రమణమ్మ

మేమెలా బతకాలి?

మృతుల కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో శ్రీకాళహస్తి నుంచి వాళ్లంతా వచ్చారు. భర్త బి.శ్రీనివాసులు మృతదేహం వద్ద ప్రమీల, కుమారుడు వసంత్, అల్లుడు కె.శ్రీనివాసులు మృతదేహాలను చూసి బ్రహ్మయ్య, రమణమ్మ కన్నీరుమున్నీరయ్యారు. 'మిమ్మల్ని పోగొట్టుకున్న మేము ఎలా బతకాలి? పిల్లలు ఏమైపోవాలి? మా పరిస్థితి ఏంటి' అంటూ తలబాదుకున్నారు. ఆ ప్రాంతమంతా విషాదం నెలకొంది.

అనుమతి లేకనే పై అంతస్తుల నిర్మాణమా?

ఈ ప్రాంతంలో జీ ప్లస్ త్రీ వరకే నిర్మాణానికి అవకాశం ఉంది. కానీ ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నారంటే.. పై అంత్తులకు అనుమతి తీసుకో లేదా? అనుమతి లేకుండా అంత ఎత్తున భవనం నిర్మిస్తుంటే పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నట్లు? ఇదీ స్థానికంగా వ్యక్తమవుతున్న ప్రశ్నలు. ఈ క్రమంలో ఐదంతస్తులకు అనుమతులున్నాయా లేవా అనేది విచారిస్తామని ఏఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది దర్యాప్తులో పరిశీలిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఈవోపీఆర్డీకి షోకాజ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తుడా అప్రూవల్ మూడు అంతస్తుల వరకే ఉంది. కానీ ఐదంతస్తులకుపైగా నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోలేదు. ఇలా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈవోపీఆర్డీ మాధురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ భవన నిర్మాణంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవన యజమానికి కార్మిక నష్టపరిహారం చట్టం కింద కార్మిక శాఖ అధికారులు నోటీసులు అందించారని, మృతుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

దారం ఊడిపోవడంతోనే ఘటన



'సారవకు కట్టిన తాళ్లు ఊడిపోవడంతో ప్రమాదం జరిగింది. జీ ప్లస్ త్రీ భవన నిర్మాణానికి అనుమతులున్నాయి. మరో రెండు అదనంగా వేశాం' అంటూ కె.ఆండాలయ్య తెలిపారు.

అంతా క్షణాల్లోనే..



ఐదో అంతస్తు వద్ద గోడకు పూత పని చేస్తుండగా అడ్డసారవకు కట్టిన దారాలు ఊడిపోయాయి. దాంతో ముగ్గురు మేస్త్రీలు కిందపడి చనిపోయారు. నేను ఓ చేత్తో కొయ్యను పట్టుకొని ఉండడంతో మృత్యువు నుంచి బయటపడ్డా. అంతా క్షణాల్లోనే, విషాదం చోటుచేసుకుంది.

- మాధవ, తాపీ మేస్త్రి

డాడీకి ఏమైందమ్మా?

పెళ్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం అక్కగారిపేట ఎస్సీ కాలనీకి చెందిన బుడతోటి శ్రీనివాసులు (38)కు భార్య ప్రమీల, కొడుకు వరుణ్‌తేజ, కుమార్తె రోషిణి ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారాయన. తిరుపతిలో పూత పని చేస్తుండగా మంగళవారం నాటి ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. భర్త మృతితో విలపిస్తున్న ప్రమీలను చూసి.. 'డాడీకి ఏమైందమ్మా' అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నారులను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.


శ్రీనివాసులు (ఫైల్ ఫోటో)

అదిగదిగో గజరాజులు!

- అడవుల్లో ఏనుగుల జాడ కనిపెట్టేందుకు డ్రోన్ల వినియోగం




ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఏనుగులు ఎక్కడ తిష్ఠ వేశాయి. ఎన్ని ఉన్నాయి? ముందుకు వస్తున్నాయా, అడవిలోకి వెళ్తున్నాయా? అని డ్రోన్లసాయంతో గజరాజుల జాడ తెలుసుకునేలా అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఈ వివరాల ఆధారంగా ట్రాకర్ల ద్వారా ఏనుగులను దారి మళ్లించడంతో పాటు సమీప ప్రజలను అప్రమత్తం చేస్తారు. శేషాచల అడవుల్లో నుంచి ఏనుగులు వేసవి రాగానే పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. ట్రాకర్లతోను, రైతులూ దండుగా వెళ్ళి అరచి, క్రాకర్స్ పేల్చి బెదిరిస్తే గతంలో ఏనుగులు అడవిలోకి వెళ్లేవి. ఇప్పుడు తిరగబడుతున్నాయి. తాజాగా ఓ రైతును తొక్కి చంపాయి. ఈ క్రమంలో ఏనుగుల జాడ పసిగట్టి.. వాటిని కట్టడి చేసేందుకు రూ.2.5 లక్షలతో అటవీశాఖ డ్రోన్‌ను కొనుగోలు చేసింది. అర కిలోమీటరు ఎత్తులో ఎగురుతూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఏనుగుల కదలికలు, పొదల్లో నక్కి ఉన్నా లైవ్ విజువల్ పంపుతుంది. అడవుల్లోకి ఏనుగులను తరుముతున్నప్పుడు (డ్రైవ్) ముందుకే పోతున్నాయా? ఎదురు తిరుగుతున్నాయా? నెమ్మదిగా పోతున్నాయా? ఆ గుంపులో గున్నలు ఉన్నాయా అనేది తెలుసుకుని సులభంగా డ్రైవ్ చేయొచ్చని అధికారులు అంటున్నారు. భాకరాపేట రేంజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ డ్రోన్‌ను తొలిసారిగా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీలోని పొలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తలకోన సౌత్ బీట్ పరిధిలో ఏనుగుల కదలికలను ఈ డ్రోన్ సాయంతో గుర్తించి అక్కడి రైతులను అప్రమత్తం చేశారు.



చిరంజీవి 'విశ్వంభర' కోసం
ఎదురు చూస్తున్నా
హీరోయిన్ ఆషిక రంగనాథ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'విశ్వంభర' సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాని హీరోయిన్ ఆషిక రంగనాథ్ తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె, ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ 'విశ్వంభర'లో చిరంజీవితో కలిసి నటించానని, అటువంటి స్టార్‌తో నటించాలంటే అదృష్టం కూడా ఉండాలన్నారు. కాగా తమిళంలో 'సర్దార్2', కన్నడలో మరో చిత్రంలో నటిస్తున్నట్టు వివరించారు.ఇక, తిరుమల శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందంటూ ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


దుమ్ములేవకుండా శుభ్రం చేస్తుంది

● టీటీడీకి విరాళంగా ఆధునిక వాహనం



తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దుమ్ము లేవకుండా వీధులు శుభ్రం చేసే వాహనం ఒకటి టీటీడీకి మంగళవారం విరాళంగా అందింది. రూ.25 లక్షల విలువైన ఈ వాహనాన్ని రోస్పిరి ప్రొఫెషనల్ అనే సంస్థ విరాళంగా ఇచ్చింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వాహనం తాళాలు అందుకుని పనితీరును పరీక్షించారు. జర్మన్ కంపెనీకి చెందిన ఈ వాహనం చాలా అడ్వాన్స్ టెక్నాలజీతో కూడుకున్నదని ఆయన చెప్పారు. క్లీనింగ్ సమయంలో దుమ్ము పైకి లేవకుండా నీటిని చల్లుతూ ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తుందన్నారు. 8 గంటల పాటు ఛార్జింగ్ పెడితే దాదాపు 46 కిలోమీటర్ల మేర వినియోగించవచ్చని వివరించారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,904

తలనీలాలు సమర్పించినవారు: 24,487



బంగారం ధరలు ఇలా

24 క్యారెట్లు(10 గ్రాములు): 99,000

22 క్యారెట్లు(10 గ్రాములు): 89,940

సవర బంగారం : 74,112

కిలో వెండి : 1,00,300





కళ తప్పిన పసిడి

అక్షయ తృతీయ...గత కొన్నాళ్లుగా ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బంగారమే..వైశాఖ మాసంలో తొలి తదియకు పురాణాల ప్రకారం విశిష్ట ప్రాధాన్యముంది. ఈ రోజున ఏం చేసినా అక్షయంగా ఉంటుందని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అందుకే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఈరోజు కొంటే అక్షయంగా పెరుగుతుందని నమ్ముతారు. అందుకే మహిళలు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. వీరిని ఆకర్షించేందుకు బంగారం వర్తకులూ పోటీపడుతుంటారు. ప్రత్యేక ఆఫర్లు,డిస్కౌంట్లు ప్రకటిస్తుంటారు. అయితే ఈ ఏడాది మున్నెన్నడూ లేని విధంగా బంగారం ధరలు పెరిగి కలవర పెడుతున్నాయి. కొనుగోలుదారులు..వర్తకుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. .షాపులో అడుగు పెట్టాలంటేనే మధ్యతరగతి వర్గాలు జంకుతున్నాయి. ఆశించిన అమ్మకాలు లేకపోవడంతో వ్యాపార వర్గాలూ నీరుగారుతున్నాయి. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఈ వర్గాలు నిరీక్షిస్తున్నాయి.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

● గణనీయంగా పెరిగిన బంగారం ధరలు ● వెలవెలబోతున్న షాపులు
● అక్షయ తృతీయ మీద వ్యాపారుల ఆశలు

గత ఏడాది కంటే 30 శాతం పైకి ధరలు

తిరుపతి నగరంలో బంగారం షాపులు సుమారుగా 80వరకూ ఉన్నాయి. అన్ని బ్రాండెడ్ షాపులూ ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇక్కడ రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వ్యాపారలావాదేవీలు జరుగుతాయి. గతేడాది మే 10న అక్షయ తృతీయ పర్వదినం సరికి గ్రాము బంగారం ధర (24 క్యారెట్లు) రూ.6,600 ఉండేది. దీంతో ఒక్క అక్షయ తృతీయ రోజునే రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల వరకూ వ్యాపారం జరిగింది. కొద్ది నెలలుగా ప్రపంచ వాణిజ్య రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతం డాలర్ ఫౌండ్ విలువ రూ.3,000 నుంచి 3,500 వరకు ఉండగా.. వచ్చే సంవత్సరానికి ఆ ధర రూ.4,500 నుంచి రూ.6,000 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తర్వాత బంగారం ధర అమాంతం పెరిగిపోయింది. గతేడాది బంగారు గ్రాము ధర రూ.6,600 ఉండగా.. ఈ సంవత్సరం గ్రాము బంగారు ధర రూ.9,000కి చేరింది. అంటే రూ.3000 వరకూ పెరిగింది. ఈ ధరల పెరుగుదల ఇంతటితో ఆగుతుందనే నమ్మకం కూడా లేదు. దీంతో కొనుగోలుదారులు సంశయంలో పడిపోయారు.

రూ.2కోట్ల మేర వ్యాపారం జరగదా?

బుధవారం నాటి అక్షయ తృతీయ మీద వ్యాపార వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కనీసం రూ.2 కోట్ల మేరయినా అమ్మకాలు జరగకపోతాయా అని ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆశించిన మేర అమ్మకాలు జరగడంలేదని ఈ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. సాధారణంగా చాలామంది అక్షయ తృతీయ రోజున అంతోఇంతో బంగారం కొనుగోలు చేస్తుంటారు. కొద్దిరోజులుగా బంగారం ధరలు విని వీరు వెనుకంజ వేస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.లక్షకు ఎగబాకడంతో గుండెలు బాదుకుంటున్నారు. అక్షయ తృతీయకు ఈసారి పరిమితంగా కొనుగోలు చేయాలనుకుంటున్నామని తిరుపతిలోని కాపువీధికి చెందిన మధ్యతరగతి గృహిణి శ్రీదేవి చెప్పారు. మార్కెట్ ట్రెండ్ ప్రకారం ఈసారి ఆశించిన మేర అమ్మకాలు జరగకపోవచ్చునని కొందరు బంగారు వర్తకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

నాణ్యత తనిఖీకి అవకాశం

గతంలో బంగారం కొంటున్నప్పుడు చాలామంది నాణ్యత చూసేవారుకాదు. ఇప్పుడు కొనుగోలుదారుల్లో అవగాహన పెరిగింది. హాల్ మార్క్ ఉందోలేదో చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌యూఐడీ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి బంగారు వస్తువు పైన హెచ్‌యూఐడీ నంబర్ ఉంటుంది. బీఐఎస్ హాల్ మార్క్ తనిఖీ చేసి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకునే సౌకర్యముంది. దీని ప్రకారం బంగారం నాణ్యతను గుర్తించవచ్చు.

ఆఫర్లు ప్రకటించి ఎదురుచూస్తున్నాం



చాలా రోజులుగా వ్యాపారం లేవు. ఖాళీగా ఉంటున్నాం. గత ఏడాదికంటే పది గ్రాముల బంగారం ధరపై సగటున రూ.3వేలకు పైగా పెరిగిపోయింది. కొనుగోలు దారులు బాగా తగ్గిపోయారు. కొంతకాలం ఆగి తరువాత కొనుగోలు చేసుకుందామని ఆలోచిస్తున్నారు. అక్షయతృతీయ సందర్భంగా తరుగు, కూలీచార్జీలు లేకుండా ఆఫర్లు ప్రకటించాం. బుధవారం అయినా కొనుగోలుదారులు వస్తారని ఆశిస్తున్నాం.

- కె.వి. సత్యనారాయణ, అధ్యక్షుడు,
తిరుపతి గోల్డ్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.95కోట్లు



శ్రీకాళహస్తి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,95,63,129 వచ్చింది. హుండీలను మంగళవారం ఉదయం లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 47.100 గ్రాములు, వెండి 702.100 కిలోలు, విదేశీ కరెన్సీ 158 వచ్చాయి. గత నెల 27 నుంచి ఈ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

నిశిరాత్రి యజమానిని కాపాడిన శునకం

● ఏనుగుల వదంతితో బావిలో పడిన వ్యక్తి
● కుక్క అరుపులు విని రక్షించిన అటవీసిబ్బంది



ఈశ్వరరావుతో అటవీసిబ్బంది

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యజమాని ప్రాణాలను కాపాడిందో శునకం. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచెర్ల, దేవరకొండ పంచాయతీలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను గుర్తించేందుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలోకి ప్రవేశించారు. అప్పటికే రాత్రి ఒంటి గంట దాటింది. అదే సమయంలో .సుబ్బరామాపురానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన పెంపుడు కుక్కతో పొలం వద్దకు కాపలాగా ఉన్నాడు. చుట్టు పక్కల రైతుల నుంచి ఏనుగులొచ్చాయంటూ గట్టిగా అరుపులు వినపడడంతో ఈశ్వరయ్య ఉలిక్కిపడ్డాడు. వెంటనే పరుగుతీశాడు. ప్రాణ భయంతో హడావిడిలో దగ్గరలోని బావిలో పడిపోయాడు. కటిక చీకటి. సమీపాన ఎవరూ లేరు. అయితే యజమాని కష్టంలో ఉన్నాడని అతని పెంపుడు కుక్క గ్రహించింది. అదేపనిగా గట్టిగా అరవడం ప్రారంభించింది. ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఎఫ్‌ఆర్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలోని ఏలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ గమనించింది. ఏం జరిగిందో తెలుసుకుందామని వెంటనే అక్కడకు చేరుకుంది. భావిలో పడి ఉన్న ఈశ్వర్యను గుర్తించింది. అటవీ శాఖ సిబ్బంది దిగి ఈశ్వరరావును రక్షించి బయటకు తీశారు. పెంచుతున్న విశ్వాసానికి అర్ధరాత్రి అరణ్యప్రాంతంలో ఆ శునకం చూపిన ప్రేమాభిమానానికి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు.

ఇక, రాత్రి గస్తీల్లో డ్రోన్

● పోలీసుల అదుపులో పది మందికి కౌన్సెలింగ్



డ్రోన్ కెమెరాతో పోలీసుల పహరా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాత్రి గస్తీల కోసం కేవలం బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు మాత్రమే రోడ్లపై తిరిగేవారు. అన్ని వీధులు, సందులు, గొందుల్లోకి వెళ్ళడానికి వీరికి సాధ్యపడే పని కాకుండా పోయింది. ఈ క్రమంలో రాత్రి గస్తీకి డ్రోన్ వినియోగించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు భావించారు. దీనికిగాను అత్యంత శక్తిమంతమైన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా వినియోగించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి తిరుపతి, శివారు ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి రాత్రి పహారా కాశారు. తద్వారా అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న అకతాయిలు, కొందరు మందుబాబులను గుర్తించారు. అలా 10 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా రాత్రి గస్తీల్లో డ్రోన్‌నూ భాగస్వామిని చేయనున్నారు. దీనికోసం తిరుపతి నగరాన్ని మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో ఒక్కో రాత్రి డ్రోన్ నిఘా ఉంచుతారు. ఇది అరకిలోమీటరుకు పైగా నింగిలోకి వెళ్లి.. మూడు కిలోమీటర్ల వ్యవధిలో కవర్ చేస్తుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడ నుంచైనా ఎమర్జెన్సీ కాల్ వస్తే వెంటనే డ్రోన్ కెమెరా ద్వారా లొకేషన్ అడ్రస్ ట్రేస్ చేసి బాధితులకు న్యాయం చేసే వెసులుబాటు కలుగుతోంది. లోకేషన్ అడ్రస్ చెప్పడం ఆలస్యం కాకుండా డ్రోన్ కెమెరాను అటుగా దిశ మళ్ళించి ఆగమేఘాల మీద ఆకాశంలో దూసుకుంటూ స్పాట్‌కు చేరుతుంది. తద్వారా పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటారు. తిరుపతి ప్రజలు, భక్తులు అర్ధరాత్రయినా ప్రశాంతమైన వాతావరణంలో గడపాలనే ఉద్దేశ్యంతో ఈ వినూత్న ప్రయోగానికి శీకారం చుట్టినట్లు ఎస్పీ చెప్పారు.

తిరుమలలో తెలంగాణవాసి మృతి

● మూర్ఛవ్యాధితో మరుగుదొడ్డిలోనే కుప్పకూలాడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఒక పబ్లిక్ మరుగుదొడ్డిలో మంగళవారం తెలంగాణవాసి ఒకరు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గద్వాల్‌కు చెందిన సురేష్‌గౌడ్(40) ఇరవై రోజుల కిందట ఇంటి నుంచి వచ్చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే సురేష్ గౌడ్ తిరుమలలో ఉంటున్నాడనే సమాచారంతో వారు రెండురోజుల కిందట తిరుమలకు చేరుకుని గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డిలో ఒక వ్యక్తి మృతదేహం ఉందని తెలిసి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతను సురేష్ గౌడ్ అని నిర్ధారించుకుని వారు కన్నీరుమున్నీరయ్యారు. గత కొంతకాలంగా సురేష్‌గౌడ్ మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడని, అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగాల తొలి జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తొలి జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఉద్యోగ నియామకాల నోడల్ అధికారి డాక్టర్ పార్థసారథిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను ప్రభుత్వ, ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. అందులో అభ్యంతరాలు కలిగిన అభ్యర్థులు మే 7వ తేదీ లోపు ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగ నియామకాల నోడల్ అధికారికి లిఖిత పూర్వకంగా పంపాలని పేర్కొన్నారు. అభ్యంతరాల కొరకు 80746 20526లో సంప్రదించాలని తెలిపారు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపల్స్‌ను, సూపరింటెండెంట్‌లను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్ రవిప్రభును ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిల్లో తిరుపతి, నంద్యాల, నెల్లూరు వైద్య కళాశాలల ప్రిన్సిపల్ నియామకాల్లో మంగళవారం మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా మొదట రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించిన అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ జె.రాధను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ పొందిన అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. రవిప్రభు రుయా సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.08 లక్షల మంది

● నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 16.05 లక్షల మంది రేషన్ కార్డుల్లో సభ్యులుగా వున్నారు. వీరిలో ఈనెల 29 వరకు దాదాపు 15 లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇక 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోకుండా దూరంగా వున్నారు. వీరందరికీ బుధవారం ఆఖరి గడువు విధించింది. అప్పటికే మూడు సార్లు గడువు పెంచిన ప్రభుత్వం మళ్లీ ఈకేవైసీ చేసుకోవడానికి గడువు పెంచుతుందా లేదా అనేది బుధవారం సాయంత్రానికి తెలుస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, గూడూరు, కోట, నాయుడుపేట, పుత్తూరులోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాల కోసం అర్హత గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజా సోము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.లక్ష మించరాదన్నారు. అలాగే 4 నుంచి 9వ తరగతి వరకున్న ఖాళీలకు కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99856 74700లో సంప్రదించాలన్నారు.

జయరాంచౌదరిని వర్చువల్‌గా విచారించనున్న కోల్‌కత్తా హైకోర్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'మయూర జయరాం చౌదరిని కోల్‌కత్తా హైకోర్టు బుధవారం వర్చువల్ విధానంలో విచారించనుంది. చక్కెర సరఫరా చేస్తామంటూ కోల్‌కత్తాకు చెందిన టిరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామ చౌదరి రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. దీనిపై విచారించిన న్యాయస్థానం జయరాంచౌదరిని అరెస్టుచేసి కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. ఆ మేరకు తిరుపతి పోలీసులు అరెస్టుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని పోలీసుల సమక్షంలో వర్చువల్ విధానంలో విచారించనుంది.

తిరుమలలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు



రాజపక్సకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ ఈవో

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీలంక మాజీ అధ్యక్షుడు నందసేన గొటబయ రాజపక్స శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని సమిష్టి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవోఆర్ భాస్కర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. రాజపక్స బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)లో 2025 విద్యాసంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 9492861369, 8500021856 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్మగ్లర్ అరెస్టు

మంగళం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భాకరపేట అటవీప్రాంతంలోకి ప్రవేశిస్తున్న ఓ స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బారిసను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం భాకరాపేట చామల సెక్షన్‌లో కూంబింగ్ నిర్వహించారు. తిరుపతి -పీలేరు రోడ్డు వైపున నిషేధిత అటవీప్రాంతంలోకి ముగ్గురు వ్యక్తులు వెళతూ టాస్క్‌ఫోర్స్ పోలీసుల కంటపడ్డారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా అడవుల్లోకి పారిపోయారు. అయితే ఒకరిని పట్టుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 గంటలు ఆలస్యంగా 'పూరీ ఎక్స్‌ప్రెస్'

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుపతి- పూరీ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ తొమ్మిది గంటలు ఆలస్యంగా నడిచింది. సోమవారం రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్, మంగళవారం ఉదయం 7 గంటలకు చేరుకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. భక్తులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న వారు నిర్ణీత సమయానికి దర్శనానికి వెళ్ళలేక పోయారని తెలిసింది. సకాలంలో తిండి లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, మంగళవారం తిరుపతిలో 10.40 గంటలకు బయలు దేరాల్సిన పూరీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.45 గంటలకు బయలు దేరి వెళ్ళిందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు తిరుపతి రైల్వే స్టేషన్‌లో మూడుగంటలు నిరీక్షించారు.

సూర్యవంశీ ఒక అద్భుతం

● శ్రీవారి సన్నిధిలో చెబుతున్నా పెద్ద ప్లేయర్ అవుతాడన్న క్రికెటర్ శ్రీశాంత్



ఆలయం ముందు కుటుంబంతో శ్రీశాంత్

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'సచిన్ టెండూల్కర్ రంజీ మ్యాచుల్లో 14 ఏళ్లకే సెంచరీ చేసిన విషయాన్ని విన్నాం. ఐపీఎల్ వంటి పెద్ద ఆటలో 14 ఏళ్ల కుర్రాడు సెంచరీ కొట్టడం అంటే అదో అద్భుతం. గుజరాత్‌పై మ్యాచ్‌లో సూర్యవంశీ సూర్యుడిలా చెలరేగిపోయాడు' అని టీం ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ప్రశంసలతో ముంచెత్తారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి చెప్తున్నా వైభవ్ సూర్యవంశీ చాలా పెద్ద ప్లేయర్ అవుతాడన్నారు.

ది రియల్ తలై అజిత్ అన్నా

తమిళ హీరో అజిత్ పద్మభూషన్ అవార్డు తీసుకోవడంపై శ్రీశాంత్ సంతోషం ప్రకటించారు. అజిత్‌కు తానో పెద్ద అభిమానని, ఆయన డైలాగ్స్ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. 'ది రియల్ తలై అజిత్ అన్నా' అన్నారు. ఇక, రాజకీయల్లో ఎంట్రీపై ప్రశ్నించగా ప్రస్తుతం అలాంటి ఆలోచనలు ఏవీ లేవని బదులిచ్చారు.

చెరువులో యువకుడి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతదాసుపల్లి చెరువులో మంగళవారం ఓ యువకుడి మృతదేహం నీటిపై తేలియాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలంలోని సంతదాసుపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్(31) తండ్రి మృతి చెందడంతో కొంతకాలంగా గూడూరులోని వామలమిట్ట ప్రాంతంలో తల్లి సుజాతమ్మతో కలిసి నివాసముంటున్నాడు. ఓ ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్న ప్రశాంత్ ఈనెల 26వ తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం సంతదాసుపల్లి చెరువులో ప్రశాంత్ మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

బైక్ బోల్తా: ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన నాగరాజు

బాలాయపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మోటరు బైక్ బోల్తాపడి ఒకరికి తీవ్రగాయాలపాలైన ఘటన బాలాయపల్లి మండలంలోని నిండలి సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరి మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన నాగరాజు డక్కిలి మండలంలోని దగ్గవోలు గ్రామంలోని అత్తగారి ఇంటికి మోటరు బైక్‌లో వెళ్తుండగా నిండలి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నాగరాజుకు రెండు చేతులు విరిగిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో నాగరాజును గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 16 మందికి రూ.8.52 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారు తన కార్యాలయంలో సంప్రదిస్తే వారికి కూడా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వాటంబేడు శివకుమార్, కిషోర్ నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, వెంటేశ్వర్లురెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, చంద్రమౌళి, రవీంద్రరెడ్డి, ఇశ్రాయేల్‌కుమార్, జలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడలకు అందాల పోటీలు


పాడి రైతులకు బహుమతులను అందజేస్తున్న పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, పశువైద్యులు

చిల్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిపేడు గ్రామంలో మంగళవారం నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించామన్నారు. లేగ దూడలను ఆరోగ్యంగా పోషిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే అధిక లాభాలను పొందవచ్చునన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై పలు పథకాలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దూడలకు డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. అందాల పోటీల్లో విజేతగా నిలిచిన దూడల యజమానులతో పాటు పోటీల్లో పాల్గొన్న పాడి రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఉపసర్పంచు నందకుమార్ యాదవ్, పశువైద్యులు సుబ్రహ్మణ్యం, షిరాజ్‌ఖాన్, పాడిరైతులు పాల్గొన్నారు.

పెన్నక్క చెరువు జల వివాదం పరిష్కారం


పెన్నక్కచెరువు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్క చెరువు జల వివాదానికి మంగళవారం అధికారులు పరిష్కారం చూపారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోట, చిల్లకూరు మండలాల ఆయకట్టు రైతులతో తహసీల్దార్ జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం చర్చలు జరిపారు. పెన్నక్క చెరువు కింద రెండో కారు వరి పంటలు వేసేందుకు ఆయకట్టు రైతులతో పాటు ఇతరులూ ప్రయత్నాలు చేశారు. అనధికారికంగా చెరువులో మోటార్లు పెట్టి నీటి సరఫరా చేస్తుండడంతో ఆయకట్టు రైతులు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కల్పించుకుని ఆయకట్టుదారులతో పాటు ఇతర రైతులనూ సమావేశపరిచి మాట్లాడారు. ఈ ఏడాది మాత్రమే చెరువు నీటిని వాడుకుని రెండో కారు పంటలు వేసేందుకు రైతులంతా అంగీకరించడంతో సమస్య పరిష్కారం అయింది.

దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో భవన నిర్మాణాల కోసం లైసెన్స్ ఇంజనీర్లు, టెక్నికల్ పర్సన్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మంగళవారం తెలిపారు. ఐటీఐ, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చన్నారు.

మాజీ సర్పంచి కృష్ణారెడ్డి మృతి



వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పారవోలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి పుల్లూరు కృష్ణారెడ్డి మంగళవారం మృతి చెందారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధరెడ్డికి సన్నిహితుడైన కృష్ణారెడ్డి మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై 15ఏళ్ల పాటు సర్పంచిగా కొనసాగారు.

ప్రశాంత వాతావరణంలో పోలేరమ్మ జాతర: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఆర్డీవో కిరణ్మయి, నెలవల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ చెంచుబాబు తదితరులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలరమ్మ జాతరను అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. జాతర నిర్వహణపై మంగళవారం నాయుడుపేట ఆర్అండ్‌బీ గృహ ప్రాంగణంలో ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన పండుగలను తమ ఆధ్వర్యంలో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గ్రామదేవత పోలేరమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతర కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ ఉరుసు, ఏటి పండుగ, పక్షుల పండుగలు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి అధికారులు, నాయకులు సహకరించడం సంతోషించ దగ్గవిషయమన్నారు. అలాగే పోలేరమ్మ జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. దేవదాయశాఖ ఈవో రవికృష్ణ మాట్లాడుతూ మే 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే జాతరలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అర్బన్ సీఐ బాబి, తహసీల్దార్ రాజేంద్ర, కమిషనర్ ఫజులుల్లా, విన్నమాల పెద్దకాపు అరవ భూమి శ్రీనివాసులురెడ్డి విద్యుత్ డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ శివశంకర్, నానబాల సుబ్బారావు, గంగాప్రసాద్, సుధీర్‌రెడ్డి, పోట్లపూడి రాజేష్, రామారావు, చిరంజీవి, అంజయ్య, షైలారి రాజశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ఆరోపణలు: టీడీపీ


శ్రీనివాససత్రం వద్ద మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో సముద్రతీర మండలాలు పారిశ్రామిక వాడలుగా మారుతున్నాయని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస సత్రంలో వేరుశనగ పంటలను టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు.ఎంత మేర పంటలు వేశారు.. పరిహారం ఎంత వచ్చింది.. అన్న విషయాలను బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని కోట, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీరప్రాంత గ్రామాలు క్రిస్ సిటీ, చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్‌తో పారిశ్రామిక హబ్‌గా మారిపోతున్నాయన్నారు. కొత్తపట్నం ప్రాంతంలో గతంలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష ఇస్తామని చెప్పిన వైసీపీ నాయకులు ప్రస్తుతం రూ.8లక్షలు ఇవ్వడం చూసి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కొంతమంది రైతులకు పట్టాలు లేకపోయినప్పటికీ వేరుశనగ పంటకు పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. ఇకనైనా ఆరోపణలు మాని అభివృద్ధికి సహక రించాలని హితవుపలికారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు తిరుమూరు మురళి, మాజీ ఎంపీటీసీ వాటంబేటి చెంగల్‌రావు, అనుక్, చల్లా సురేష్, వెంకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్ రద్దు చేయండి


ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్ ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఏవో రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని, దీని వల్ల గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ఆ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని వ్యవయసా కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెలుగు రమేష్, రైతులు ఎం.సత్యనారాయణ, డి.వేణుగోపాల్, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

గ్రైండర్ అందజేత

నాయుడుపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న తీగల రాము, ఉష దంపతులకు బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ సభ్యులు గ్రైండర్ అందజేశారు. కార్యక్రమంలో పగడాల శివప్రదీప్, హంసా పృధ్వీచంద్, చింతపూడి శ్రీధర్, గడదాసు వెంకటేశ్వర్లు, నీలం హరికృష్ణ, దర్శి కిరణ్, మోతుకోరు కోటేశ్వరావు, మదిరి వెంకి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ప్రయాణికుడు

ఎంతకీ లేవకపోవడంతో ఆందోళన


మద్యం మత్తులో ఉన్న ప్రయాణికుడు

చిట్టమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం తాగి బస్సెక్కి సీట్లో కూర్చున్న ప్రయాణికుడు స్పృహ కోల్పోవడంతో డ్రైవర్, కండెక్టర్ ఆందోళనకు గురయ్యారు. నాయుడుపేట నుంచి మల్లాం వెళ్లే ఆర్టీసీ బసెక్కిన ఓ ప్రయాణికుడు సీట్లో కూర్చున్నాడు. బస్సు మిట్టకండ్రిగ స్టేజి దగ్గర వెళ్తుతుండగా మహిళా కండక్టర్ టికెట్ తీసుకోమని అడిగారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఎంత పిలిచినా లేవలేదు. డ్రైవర్, ప్రయాణికులు తట్టి లేపినా కదలిక లేవకపోవడంతో ఆందోళన చెందారు. ఇంతలో బస్సు కొత్తగుంటకు చేరుకోవడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నించారు. ఇంతలో కొందరు ముఖంపై నీళ్లు చల్లడంతో స్పృహలోకి వచ్చాడు. అయితే తాను ఎవరన్నది చెప్పలేకపోయాడు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ రాధ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈమె రుయాలో అనస్తీషియా విభాగాధిపతిగా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. అనంతరం డాక్టర్ రాధ బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రెండు రోజులు క్రితం రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపాళ్లను, సూపరింటెండెంట్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్‌ను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

గోశాలకు జెంబో కూలర్ల వితరణ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా టీటీడీ గోశాలకు ఓ దాత రెండు జెంబో కూలర్లను వితరణ చేశారు. హైదరాబాదుకు చెందిన రంగశ్రీ (టీటీడీ బోర్డు సభ్యురాలు) అధునాతనమైన రెండో జెంబో కూలర్‌ను తిరుపతికి చేర్చారు. వాటిని జనసేన నేత కిరణ్‌రాయల్ మంగళవారం గోశాల డిప్యూటీ డైరెక్టర్ ఉపేంద్రవర్మ, డాక్టర్ భువనలకు అందజేశారు. కాగా ఇప్పటికే కిరణ్‌రాయల్ రెండు జెంబో కూలర్లను వితరణ చేయగా లేగదూడలకు వినియోగిస్తున్నారు.

అసత్య ఆరోపణలు తగవు: పాశం

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తనపై అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతికాదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాయంలో మాట్లాడుతూ తాము ప్రతిపక్ష నేతలతో చేతులు కలిపినట్లు కొన్ని ఛానళ్లు, పత్రికల్లో వార్తలు ప్రచారం చేయడం అవాస్తవమన్నారు. కోట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సర్వోత్తమరెడ్డి పార్టీకి రాజీనామా చేశారని, ఇతనితో తనకు ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. కష్టకాలంలో పార్టీ బలోపేతానికి సర్వోత్తమరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. త్వరలోనే ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు.

ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రతిభ చూపిన ఎన్‌బీకేఆర్ కళాశాల విద్యార్థులను మంగళవారం డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈసీఈ విద్యార్థులు నవంత్‌రెడ్డి, గోపి, కృష్ణకుమార్ ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీ నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఏ1 సొల్యూషన్ ఫర్ సస్టైనబుల్ ఎలక్ట్రానిక్ అండ్ వైర్‌లెస్ సిస్టమ్స్ అంశంలో అనాలసిస్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ కోర్ బిట్ ఏఎల్‌యు ఫర్ నానో ప్రాసెసర్ డిజైన్ వ్యూజింగ్ సిమోస్ టెక్నాలజీ సాంకేతిక పత్ర ప్రదర్శనకు బెస్ట్ పేపర్ అవార్డు లభించింది. ఆయా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ హరినాథరెడ్డి ప్రశంసా పత్రాలతో అభినందించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న పొన్నూరు శీనయ్య (45) మంగళవారం మృతిచెందాడు. తిన్నెలపూడి పంచాయతీలోని నారుమిట్ట గిరిజన కాలనీకి చెందిన శీనయ్యను బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేద మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు.మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అబ్దుల్‌రహీం, మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అలిపిరి పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అజిత కథనం మేరకు.. స్థానిక రాఘవేంద్రనగర్‌కు చెందిన రవీంద్ర పార్శిల్ కార్యాలయంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు పది రోజుల క్రితం ఇస్కాన్ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం ఉంచి పనిమీద వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూడగా వాహనం లేదు. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమపేరుతో మోసం.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన వ్యక్తిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సరస్వతి కథనం మేరకు.. స్థానిక కెనడీనగర్‌కు చెందిన ఎన్‌వీ లక్ష్మి రేణిగుంట రోడ్డులోని ఒక ప్రైవేటు హౌసింగ్ కంపెనీలో పనిచేస్తోంది. ఈమెకు ఇటీవల గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన వడివేలుతో పరిచయమైంది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో వడివేలు మరొకరితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

గురుమూర్తి మృతి ఘటనలో 13మందిపై కేసు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని ద్వారకాపురం వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను మినీ వ్యాన్ ఢీకొనడంతో ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురుమూర్తి మృతిచెందిన విషయం తెలిసిందే. తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేశారని మృతుడి కుమారుడు గురుతేజ మంగళవారం నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగి కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మృతుడు గురుమూర్తి అదే గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటర్ సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి బయలు దేరారు. ఈ విషయం తెలుసుకున్న గురుమూర్తి ప్రత్యర్థులు మినీవ్యాన్‌లో నాయుడుపేట నుంచి వెంబడించి ద్వారకాపురం వద్ద మోటర్ సైకిల్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వాహనంలోని ఇద్దరు వ్యక్తులను మరో వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తిరుపతి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, గురుమూర్తి బైక్‌ను ఢీకొన్ని మినీవ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎస్పీ ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ఇటీవల అత్తివరంలో పరిశ్రమలు నెలకొల్పడంతో కాంట్రాక్ట్ పనుల విషయమై తలెత్తిన విభేదాలే గురుమూర్తి హత్యకు కారణమని సమాచారం.

వేడుకగా ధర్మరాజస్వామి రాజసూయ యాగం


గ్రామోత్సవంలో ద్రౌపదీదేవి

తడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాజసూయయాగం అట్టహాసంగా జరిగింది. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ద్రౌపది సమేత ధర్మరాజస్వామి రాజసూయ యాగాన్ని వేదపండితులు శాస్త్రోతంగా నిర్వహించారు. తరువాత ప్రత్యేక పూలతో అలంకరించి ధర్మరాజస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ జరిగింది. బుధవారం గరుడసేవ జరుగనున్న నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండో రోజు కొనసాగిన రిలే దీక్ష


గూడూరు డిపో వద్ద రిలే దీక్ష చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్యారేజీలో సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళా కండక్టర్లను ఇబ్బంది పెట్టకుండా అన్ని రకాల సెలవులను అమలు చేయాలన్నారు. అలాగే అర్హత ఉన్నవారందరికీ పదోన్నతలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చెంచులయ్య, శ్రీనివాసులు, కృష్ణ, ప్రవీణ్, గౌస్, కమలాకర్, గాంధీ, రవి, నారాయణరావు, నరసింహప్రసాద్, సందానీ, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ఆర్టీసీ కార్మికుల సాధన కోసం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రీలే దీక్ష మంగళవారం రెండోరోజూ కొనసాగింది. ప్రభుత్వం స్పందించి తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిపో ప్రెసిడెంట్ పీవీరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబు, మణ్యం, చలపతి, రజాక్, మస్తానయ్య, అంకయ్య, దశయ్య, బాబు, రాము పాల్గొన్నారు.

నేటినుంచి రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో ఈ నెల 30 నుంచి మే 2వ తేదీ వరకు రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి.

బదిలీ చేయిస్తానని రూ.5 లక్షల స్వాహా

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బదిలీ చేయిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన కుమారి గతంలో రుయా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసింది. గత ప్రభుత్వంలో ఆమెను కడప రిమ్స్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో రామచంద్రాపురం మండలం పరమాలకు చెందిన చెంగల్రాయులు తనకు ఆరోగ్యశాఖలో బాగా తెలిసిన అధికారులు ఉన్నారని రూ.5 లక్షలు ఇస్తే ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని నమ్మించి నగదు తీసుకున్నాడు. అయితే బదిలీ కాలేదు. దీంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె కోరింది. అతడి నుంచి సమాధానం రాకపోవడంతో మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.